# తెలుగురాష్ట్రం

తెలుగు దినపత్రిక

APTEL/2016/66202

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 229 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 09 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 229 09-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు...

**రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్**

3 లో..

## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి..

# దేశాన్ని బలోపేతం చేయండి..

- నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రతి ఒక్కరూ 'స్వదేశీ' మంత్రాన్ని పాటించాలని ప్రజలకు పిలుపు
- దేశీయ వస్తువుల వాడకంతోనే అభివృద్ధి, ఉద్యోగాల కల్పన సాధ్యమని స్పష్టం
- ముంబై ఉగ్రదాడి తర్వాత యూపీఏ ప్రభుత్వం బలహీనంగా వ్యవహరించిందని విమర్శ
- మహారాష్ట్రలో అఘాడీ ప్రభుత్వం అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసిందని ఆరోపణ
- వికసిత భారత్ లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఉద్ఘాటన



న్యూఢిల్లీ అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశ ప్రజలు 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం (NMIA) మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకం వల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం అవ్వడమే కాకుండా, యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. "ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలి. ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలి. ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుంది. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయి" అని ప్రధాని మోదీ వివరించారు. జీఎస్టీ సంస్కరణల వల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే

- తరువాయి 2లో..

## మరింత విజయవంతం చేద్దాం...

- ప్రధాని మోదీ ఏపీ పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఈ నెల 16న ఆంధ్రప్రదేశ్‌కు రానున్న ప్రధాని మోదీ
- శ్రీశైలం మల్లన్నను దర్శించుకోనున్న నరేంద్ర మోదీ
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో భారీ బహిరంగ సభ
- జీఎస్టీ సంస్కరణల ఉత్సవంలో పాల్గొననున్న ప్రధాని
- ప్రధాని పర్యటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కూటమి ప్రభుత్వం
- సభను విజయవంతం చేయాలని అధికారులకు సీఎం ఆదేశాలు



అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ నెల 16న ప్రధాని మోదీ రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో, ఆయన పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనను గతంలో అమరావతి, విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమాలను మించి విజయవంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొదట ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠ క్షేత్రమైన శ్రీశైలాన్ని సందర్శించి, భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకోనున్నారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేయనున్న భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తారు. కేంద్ర

- తరువాయి 2లో..

## అవసరమైతే పోస్టుమార్టం చేసి

# నిగ్గుతేల్చండి..

- కల్తీ మద్యం తయారీదారులపై ఉక్కుపాదం మోపాలని చంద్రబాబు ఆదేశం
- మద్యం మరణాలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని తీవ్ర ఆరోపణ
- అసత్య ప్రచారం చేసేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- సహజ మరణాలను కూడా కల్తీకి ముడిపెడుతున్నారని ముఖ్యమంత్రి వ్యాఖ్య
- అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో వెలుగులోకి వచ్చిన కల్తీ మద్యం దందా
- ఫేక్ ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని మంత్రులకు దిశానిర్దేశం



అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో కల్తీ మద్యం తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు, ఇదే అంశాన్ని అడ్డం పెట్టుకుని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా జరుగుతున్న రాజకీయ దుష్ప్రచారాన్ని

- తరువాయి 2లో..

## దేశ చరిత్రలో ఏపీకి..

## అతిపెద్ద విదేశీ

# ప్రత్యక్ష పెట్టుబడి

- రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం
- 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు
- మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు
- ఇప్పటి వరకూ 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్లు పెట్టుబడులు- 6.20 లక్షల ఉద్యోగ అవకాశాలు

అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా

- తరువాయి 2లో..



## ఏపీలో రోడ్ల మరమ్మతులకు

# భారీగా నిధుల విడుదల

- ఏపీలో రోడ్ల మరమ్మతుల కోసం రూ.1,000 కోట్లు
- పాలనాపరమైన అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 274 రహదారులకు మరమ్మతులు
- రాష్ట్ర రహదారులకు రూ.400 కోట్లు కేటాయింపు
- జిల్లా రహదారుల కోసం మరో రూ.600 కోట్లు

అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



ఆంధ్రప్రదేశ్‌లో రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం ఏకంగా రూ. 1,000 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధులకు పాలనా పరమైన అనుమతులు ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు

- తరువాయి 2లో..







విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే..

# భారీ విస్ఫోటం

ఏడుగురు మృతి- పలువురికి గాయాలు

- లక్ష్మీ గణపతి ఫైర్‌వర్క్స్‌లోో భారీ అగ్నిప్రమాదం.
- ఏడుగురు దుర్మరణం - పలువురికి తీవ్రగాయాలు
- సహాయక చర్యలో పాల్గొనండి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- అగ్ని ప్రమాదం ఆవేదన కలిగించింది : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- కొమరిపాలెం దుర్ఘటన స్థలాన్ని పరిశీలించిన హోం మంత్రి వంగలపూడి అనిత - బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ

3 లో

## రాయవరం ఘటనలో

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం

# అండగా ఉంటుంది

- మంత్రి నారా లోకేశ్
- కోనసీమ జిల్లా రాయవరంలో భారీ అగ్నిప్రమాదం
- బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు.. ఆరుగురు కార్మికులు మృతి
- ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి



అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన

- తరువాయి 2లో..

## నేడు కాకినాడ, ఉప్పాడలో

# పవన్ కల్యాణ్ పర్యటన...

- మత్స్యకారుల కోసం సముద్రంలో ప్రయాణం
- గురువారం నాడు పిఠాపురం నియోజకవర్గంలో పవన్ పర్యటన
- ఉప్పాడ మత్స్యకారులతో భేటీ, వారి సమస్యలు తెలుసుకోనున్న పవన్
- సముద్ర కాలుష్యంపై స్వయంగా పరిశీలనకు పడవ ప్రయాణం
- మత్స్యకారులను ఉద్దేశించి ఉప్పాడలో ప్రసంగం
- నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గంలో క్షేత్రస్థాయి పర్యటనకు సిద్ధమయ్యారు. గురువారం (అక్టోబర్ 9) ఆయన పిఠాపురం నియోజకవర్గంలో

- తరువాయి 2లో..

## షెడ్యూల్ ప్రకారం .. నేడు యథావిధిగా

# ఎన్నికల నోటిఫికేషన్

- నోటిఫికేషన్ విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరణ
- రెండు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

హైదరాబాద్ అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు మార్గం సుగమం అయింది. నోటిఫికేషన్ విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో షెడ్యూల్ ప్రకారం రేపు యథావిధిగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- తరువాయి 2లో..




# ద్రోణి ప్రభావం..

- ఏపీలో రెండు రోజులపాటు వర్షాలు
- ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రెండు రోజులపాటు వర్షాలు
- ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్ష సూచన
- ఆరు జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రాగల మూడు గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు
- చెట్ల కింద నిలబడవద్దని ప్రజలకు విపత్తుల నిర్వహణ సంస్థ సూచన



అమరావతి అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజులపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల ప్రజలు

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## దేశాభివృద్ధికి వలసల దెబ్బ!

భారతదేశంలో అన్ని రకాల వనరులు ఉన్నా, సంపద సృష్టికి అవకాశాలు ఉన్నా మేధో వలసలు దేశాభివృద్ధికి శాపంగా మారిపోయాయి. ఒకప్పుడు తన శక్తియుక్తులు వినియోగించు భారతదేశంలో అన్ని రకాల వనరులు ఉన్నా, సంపద సృష్టికి అవకాశాలు ఉన్నా మేధో వలసలు దేశాభివృద్ధికి శాపంగా మారిపోయాయి. ఒకప్పుడు తన శక్తియుక్తులు వినియోగించుకోవాలంటే తగిన శాస్త్రవిజ్ఞానం, వనరులు మాతృదేశం సమకూర్చలేదు కనుక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, ఉన్నత విద్య అవసరార్థులు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా లాంటి అభివృద్ధి చెందిన, వనరులు పుష్కలంగా ఉన్న దేశాలను ఆశ్రయించేవారు. దానినే మేధోవలసగా మనం ముద్దు పేరు పెట్టుకున్నాం. 21వ శతాబ్దం ఆరంభంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనబడే ఆధునిక మార్పులు తర్వాత మేధోవలసలు పేరుతో, విద్య పేరుతో, ఉద్యోగాల పేరు విదేశాల్లో స్థిరపడే వారి సంఖ్య బాగా పెరిగిపోయింది. ఒక రకంగా నేటి యువతకు విదేశాల్లో స్థిరపడడం అనేది ఒక హోదాగా, సామాజిక స్టేటస్‌గా భావించే ఒక స్థితికి నేడు విదేశీ వలసలు చేరిపోయాయి.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంఫ్ లాంటి వారు హెచ్ 1బి వీసాదారులు కోటి రూపాయలు రుసుంగా చెల్లించాలని అసాధారణ ఉత్తర్వులు ఇవ్వడం, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా లాంటి కీలక దేశాల్లో విదేశీ వలసలు, ముఖ్యంగా భారతీయ వలసదారులపట్ల ప్రదర్శనలు జరపడం, అసహనం వ్యక్తం చేయడం జరుగుతున్న నేపథ్యంలో దేశ యువత విదేశీ వలసలపై ఒక ఆలోచన చేయవలసిన సమయం ఆసన్నమైంది. ఒకనాడు మేధోవలసస్థితి నుండి నేడు సాధారణ జీవనవలసలు వరకు చాలా పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రవిజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, ఐటి, ఎఐ లాంటి టెక్నాలజీ పరాయి దేశాల్లో అభివృద్ధి చేస్తున్న భారతీయుల సంఖ్య ప్రస్తుతం అధికంగానే ఉంది. ప్రపంచీకరణవల్ల నేడు ప్రపంచం ఒక కుగ్రామం గా మారిన సాంకేతిక స్థితిలో వలసలు సర్వసాధారణం కావచ్చును. కానీ, అధిక జనాభా, యువశక్తి, పునరుత్పత్తి అధికంగా ఉన్న భారతీయ సమాజం కు వలసలు ఒకరకంగా శాపంగా పరిణమించే అవకాశం ఉంది. ఈ భూమిపై పుట్టి, ఈ మట్టిలో పెరిగి, తీరా పరిపూర్ణమైన జ్ఞానవంతుడుగా భారతీయ సమాజం తీర్చిదిద్దిన తర్వాత తమ సేవలు ఇతర దేశాలకు అందించడం అంటే పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను అనాథ్రశయంలోనో, వీధుల్లోనో వదిలేసిన పుత్ర ఉత్తముల చందమే తప్ప మరొకటి కాదు? ఇప్పటికే 3 కోట్ల 54 లక్షల మంది భారతీయులు వివిధ దేశాల్లో వలసజీవులుగా పరాయి పంచన జీవిస్తున్నారు. అంతేకాదు కెనడా లాంటి దేశాల్లో పార్లమెంటు సభ్యులుగా కూడా భారతీయులు పెద్ద సంఖ్యలో ఎన్నిక కావడం చూస్తే ఆధునిక వలస స్థితిని ఆ రాజకీయ ప్రాధాన్యత గుర్తు చేస్తుంది. వివిధ దేశాల్లో జీవిస్తున్న భారతీయ వలసదారుల స్థితి ఈ విధంగా ఉంది. అమెరికా- 51.6 లక్షలు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ -44.3 లక్షలు, సౌదీ అరేబియా -26 లక్షలు, మలేసియా -20 లక్షలు, మయన్మార్ -20 లక్షలు, కెనడా- 18.6 లక్షలు, యునైటెడ్ కింగ్డమ్ -19.3 లక్షలు, దక్షిణఆఫ్రికా -17లక్షలు, ఓమన్ -13.8 లక్షలు, ఆస్ట్రేలియా -83 వేలు, ఇంకా చిన్నాచితకా దేశాలన్నింటా వివిధ స్థాయిల్లో, సంఖ్యలో భారతీయ వలసలు ఉన్నాయి. ఒకప్పుడు మేధోవలసలు మాత్రమే ఉన్న స్థితినుండి నేడు దేశంలో పాలకులు అనుసరిస్తున్న సరళీకృత విధానాలు మూలంగా ప్రభుత్వ రంగంలో ఉద్యోగాలు లభ్యం కాకపోవడం, రూపాయి విలువ రోజురోజుకు కుంచించుకుపోవడం, వ్యాపారం, పారిశ్రామిక సంబంధాలు దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోవడం, సాంకేతిక పరిజ్ఞానం, రవాణా సౌకర్యాలు వేగంగా విస్తరించడం, ఉచితమైన నాణ్యమైన విద్య, వైద్యం దేశంలో గగన కుసుమం కావడం, నైతికతతో కూడుకున్న విశ్వసనీయమైన రాజకీయ వ్యవస్థ లేకపోవడం, నేడు విదేశీ వలసలు విపరీతంగా పెరగడానికి కారణం అవుతుంది. ఫలితంగా మన దేశం అభివృద్ధి కుంటుపడడమే కాకుండా సామాజిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకులుకు లోనవుతున్నది. ఒకప్పుడు స్వయం పోషక పటిష్టమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఈ విదేశీ వలసలు మూలంగా సంక్షోభిత స్థితికి చేరుకుంటున్నది. ఉదాహరణకు తెలుగు రాష్ట్ర పల్లెల్లో ఇప్పటికే 20 శాతం ఇండ్లకు తాళం కప్పులు వేలాడుతున్నాయి. రైతుల పిల్లలు ఉద్యోగాల పేరుతో విదేశాలకు వలసలు వెళ్ళడం, రైతులు పట్టణాలకు వలస వెళ్ళడం, ఫలితంగా కౌలు వ్యవసాయదారులు సంఖ్య గ్రామాల్లో పెరగడం, గిట్టుబాటు ధరల క్షీణత పట్ల, వ్యవసాయ రంగం పట్ల అనాసక్తి భవిష్యత్తు దేశ ఆహార సంక్షోభిత స్థితిని చెప్పకనే చెబుతున్నది. అంటే విదేశీ వలసలతో క్రమంగా పల్లెసీమలు వట్టిపోతున్నాయని అర్థం. ఇక రెండో అంశానికి వస్తే ఇది చాలా దారుణమైన స్థితి. ఒక్కో ఐఐటి విద్యార్థిమీద కేంద్ర ప్రభుత్వం ఏటా నాలుగు లక్షలు చొప్పున, ఒక్కో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ బయటకు రావడానికి కనిష్టంగా 24 లక్షలు ఖర్చు పెడుతుంది. రాజ్యాంగానికే అవమానం ఒక్కో ప్రభుత్వ సంస్థలో ఎంబిబియస్ పూర్తికావడానికి ఒక్కో విద్యార్థిపై 1.7 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తే, అదే ప్రైవేటు సంస్థల్లో అయితే 1.95 కోట్లు రూపాయలు తల్లిదండ్రులు ఖర్చు పెడుతున్నారు. అంతెందుకు సాధారణ డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్య కోసం సైతం పెద్ద మొత్తమే ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. ఇదంతా ప్రజల పన్నుల నుండి వచ్చే సొమ్ము మాత్రమే! అంటే, ప్రజల సొమ్ముతో పరిపూర్ణమైన పరిజ్ఞానం పొందిన మనం, మన ప్రజలకు ఉపయోగపడకుండా, దేశాభివృద్ధిలో భాగస్వాములు కాకుండా ఎయిర్‌బస్‌లపై కృత్రిమ రెక్కలతో ఎగిరిపోయి, పరాయి పంచన వ్యక్తి గత స్వార్థాలతో జీవించడం, మన యువశక్తిని, శ్రమ శక్తిని మనమే నిర్వీర్యం చేసుకున్నట్లు కాదా? యువత ఆలోచించాలి. అదే విధంగా ప్రభుత్వాలు కూడా ఉత్పత్తి అవుతున్న యువతకు, తమ మేధకు తగ్గ పని అప్పగించడంలో బాధ్యతగా, చిత్తశుద్ధిగా వ్యవహరించాలి. మన శక్తిని మనమే నిర్వీర్యం చేసుకునేలా ప్రభుత్వాలు వైఖరి ఉండరాదు. యువశక్తిని సద్వినియోగం చేసుకొని జనాభాలోనే కాదు! అన్ని రంగాల్లో ముందు ఉండేలా, స్వయం సమృద్ధి, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. ప్రభుత్వరంగంలో పని అవకాశాలు యువతకు పెంపొందించాలి. మన పురాతన వైద్యం, శాస్త్రవిజ్ఞానం ప్రపంచ చరిత్రలో ఘనంగా ఉంది. సర్ సివి రామన్, అరగోవింద్ ఖురానా, అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలు, రామానుజన్, శకుంతలా దేవి లాంటి గణిత దిగ్గజాలు, స్వామి వివేకానంద లాంటి సామాజిక వేత్తలు వీరే యువతకు ఆదర్శం. కనుక ఆధునిక యువత కూడా దేశం కోసం పని చేయడమే నిజమైన దేశభక్తి అనే కోణంలో ఆలోచించాలి. ఇప్పటికైనా యువత విదేశాల్లో ద్వితీయ జాతి పౌరులుగా ఎదురవుతున్న అవమానాలు దిగమింగుకొని బతకడం కన్నా మాతృభూమి సేవలో తరించడం మిన్నగా, ఆత్మగౌరవంగా భావించాలి. పుట్టి పెరిగిన గడ్డకు సేవలు అందించాలి. ఒక వైపు ఆధునిక యువత, మరోవైపు ఆధునిక ప్రభుత్వాలు ఈ విషయంలో లోతైన ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. మేధో వలసలు, విదేశీ వలసలు అరికడదాం. స్వదేశ అభివృద్ధికి నూతన బాటలు, ప్రణాళికలు ఆశిద్దాం.

## స్వదేశీని మంత్రాన్ని స్వీకరించండి.. దేశాన్ని బలోపేతం చేయండి..

ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశ భద్రతే అత్యంత ప్రాధాన్యమని, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు. అంతేకాకుండా, మహారాష్ట్రలోని గత మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం అనేక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేయడం వల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లిందని మోదీ విమర్శించారు. నవీ ముంబై విమానాశ్రయం, ఇతర కనెక్టివిటీ ప్రాజెక్టులతో ముంబై నగరం ప్రపంచస్థాయి వృద్ధి కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. "ఈ ఎయిర్‌పోర్ట్ 'వికసిత భారత్' సంకల్పానికి ప్రతీక. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను యూరప్, గల్ఫ్ దేశాలకు సులభంగా ఎగుమతి చేయవచ్చు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు లబ్ధి చేకూరుతుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ముంబై మెట్రో లైన్-3 చివరి దశను కూడా ప్రారంభించారు. దీంతోపాటు 'ముంబై వన్ యాప్', యువతకు ఉపాధి ఆధారిత శిక్షణ అందించే 'ముఖ్యమంత్రి షార్ట్-టర్మ్ ఎంప్లాయబిలిటీ ప్రోగ్రామ్ (%ాజుూ%)'ను కూడా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజల కోసం విశేష కృషి చేసిన లోక్‌నేత డీబీ పాటిల్ సేవలను ఆయన స్మరించుకున్నారు.

## మరింత విజయవంతం చేద్దాం...

ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ-2.0 సంస్కరణలకు మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్' కార్యక్రమంలో భాగంగా ఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ సంస్కరణలను స్వాగతిస్తూ దేశంలోనే తొలిసారిగా ఏపీ అసెంబ్లీలో అభినందన తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దసరా నుంచి దీపావళి వరకు జరుగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రధాని సభను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. సభా ప్రాంగణానికి వెళ్లే అప్రోచ్ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, కందుల దుర్గేశ్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అవసరమైతే పోస్టుమార్టం చేసి నిగ్గుతేల్చండి..

కూడా అంతే తీవ్రంగా అణిచివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులు, మంత్రులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఆయన ఈ అంశంపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కల్తీ మద్యం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని, అదే సమయంలో సహజ మరణాలను కూడా కల్తీ మద్యం మరణాలుగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

### అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు

కొన్ని రాజకీయ పక్షాలు రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం ఏరులై పారుతోందంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. "ప్రతి మూడు మద్యం బాటిళ్లలో ఒకటి కల్తీదేనని, కల్తీ మద్యం తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఒక పథకం ప్రకారం ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. ఇది పూర్తిగా రాజకీయ కుట్ర" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి ఆరోపణలు వచ్చిన ప్రతిచోటా సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. "మద్యం మరణం అని ప్రచారం చేసిన ప్రతి కేసులోనూ అవసరమైతే పోస్టుమార్టం నిర్వహించి, శాస్త్రీయ ఆధారాలతో మరణానికి గల అసలు కారణాలను నిగ్గు తేల్చండి. వాస్తవాలను ప్రజల ముందు ఉంచండి" అని సూచించారు. రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తేలితే, వారు మీడియా అయినా, సోషల్ మీడియా అయినా సరే, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వం సైలెంట్‌గా చూస్తూ ఊరుకోదని ఆయన స్పష్టం చేశారు.

### కల్తీ మద్యంపై యుద్ధం

గత 15 నెలల్లో పటిష్టమైన చర్యల ద్వారా పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను విజయవంతంగా అరికట్టామని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో పనిచేసి రాష్ట్రంలో కల్తీ మద్యం అనేదే లేకుండా చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలో ఒక్క కల్తీ మద్యం తయారీ కేంద్రం కూడా ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు అన్నమయ్య, ఎన్టీఆర్ జిల్లాల్లో చేపట్టిన చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు.

### వెలుగులోకి వచ్చిన ముఠాల దందా

అన్నమయ్య జిల్లా ములకలచెరువులో వెలుగు చూసిన కల్తీ మద్యం కేసులో ఇప్పటివరకు 21 మందిని నిందితులుగా గుర్తించామని, వారిలో 12 మందిని అరెస్టు చేశామని అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అద్దేపల్లి జనార్ధన్‌రావు కార్యకలాపాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నామన్నారు. అతనిచ్చిన సమాచారంతో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని అతనికి చెందిన వ్యాపార సముదాయాల్లో తనిఖీలు నిర్వహించగా, కిరాణా షాపు వెనుక భారీగా కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు వివరించారు. సుమారు 15 ఏళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న జనార్ధన్‌రావు, తన సోదరుడు జగన్ మోహన్ రావుతో కలిసి అధిక లాభాల కోసం ఈ కల్తీ దందాను నిర్వహిస్తున్నట్లు తేలిందన్నారు. ఇబ్రహీంపట్నం కేసులో 12 మంది నిందితులను గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేశామని, నలుగురిని పీటీ వారెంట్‌పై విచారిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.

### వైసీపీపై సీఎం రాజకీయ విమర్శలు

ఈ సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారా లోకేశ్ ప్రత్యక్షంగా పాల్గొనగా, హోంమంత్రితో సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి ప్రతిపక్ష వైసీపీకి ఎలాంటి అంశాలు దొరకడం లేదన్నారు. "ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నాం. దీంతో విమర్శలకు తావులేక, తమ పాత సిద్ధాంతమైన ఫేక్ ప్రచారాన్ని నమ్ముకున్నారు. 2019లో వివేకా హత్య సమయంలో వారు ఆడిన శవ రాజకీయాలను మర్చిపోవద్దు. వారి కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన బాధ్యత మంత్రులు, ప్రజాప్రతినిధులపై ఉంది" అని ఆయన దిశానిర్దేశం చేశారు. వాస్తవాలను ప్రజలకు వివరించి, వారిలో ధైర్యం నింపాలని సూచించారు.

## దేశ చరిత్రలో ఏపీకి అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం..ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయని అన్నారు. కేవలం 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

### ప్రాంతాల వారీగా పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి

క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను , నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

### మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్థన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

### 11వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు ఇవీ

యాక్మే ఊర్జా ఒన్ లిమిటెడ్ - అనంతపురం జిల్లాలో సౌర విద్యుత్ ప్రాజెక్టులో రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1380 మందికి ఉద్యోగాలు. టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1,380 మందికి ఉద్యోగాలు. చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విజయనగరం జిల్లాలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టు రూ.12,905 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు. ఆంప్లిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టు రూ.15.10 కోట్లు పెట్టుబడి రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో ఎఫ్ఎంసీజీలో రూ.758 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ రూ.208 కోట్ల పెట్టుబడులు, 66 మందికి ఉద్యోగాలు. ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ రూ.201 కోట్ల పెట్టుబడి, 436 మందికి ఉద్యోగాలు ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.33 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు . దస్పల్లా అమరావతి హోటల్స్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు. వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్ అరకు వ్యాలీలో రూ.55 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగాలు. శ్రీవేంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీశైలంలో రూ.83 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అమరావతిలో రూ.117 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు. మైరా బే వ్యూ రిసార్ట్స్ కొత్తవలసలో కన్వెన్షన్ సెంటర్ కు రూ.256 కోట్ల పెట్టుబడి. ఎస్వీఎస్ కనస్ట్రక్షన్స్ కాకినాడ లో రూ.87 కోట్ల పెట్టుబడి, రైడన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.87,520 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు. ఇమాజినేటివ్ టెక్నో సొల్యూషన్స్ ఇండియా విశాఖ కాపులుప్పాడ లో ఐటీ లాజిస్టిక్స్ రూ.140 కోట్ల పెట్టుబడి, 2600 మందికి ఉద్యోగాలు. శాన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనకాపల్లిలో అడ్వాన్స్డ్ కార్బన్ కాంప్లెక్స్ రూ.2600 కోట్ల పెట్టుబడి, 800 మందికి ఉద్యోగాలు. శ్రీ సిమెంట్ లిమిటెడ్, పలనాడులో సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ రూ.2260 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు. రేమండ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ అనంతపురంలో ఏరో స్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్ రూ.430 కోట్ల పెట్టుబడి, 4,096 మందికి ఉద్యోగాలు. రేమాండ్ జేకే మైనీ గ్లోబల్ ఎరోస్పేస్ లిమిటెడ్, అనంతపురంలో ఏరోస్పేస్ కాంపోనెంట్లు రూ.510 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ.1200 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు. అలీప్ ఓర్వకల్లు వద్ద మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోసం రూ.36.25 కోట్ల పెట్టుబడి, 3000 మందికి ఉద్యోగాలు
23. అవంతీ వేర్ హౌసింగ్ సర్వీసెస్ విశాఖలో గుర్రమ్ పాలెం, రూ.319 కోట్ల పెట్టుబడి
24.అస్సెల్ ఈఎస్ జీ కర్నూలు జిల్లా కృష్ణగిరిలో రూ.300 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు. ఫెయిర్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ మల్లవెల్లి లో మెగా ఫుడ్ పార్క్ కోర్ ప్రాసెసింగ్ సెంటర్. జెఎస్ డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్క్, విజయనగరంలో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్, రూ.531 కోట్ల పెట్టుబడి, 45000 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

## ఏపీలో రోడ్ల మరమ్మతులకు భారీగా నిధుల విడుదల

జారీ చేశారు. ఈ నిధులతో రాష్ట్రంలోని మొత్తం 274 రహదారులను బాగుచేయనున్నారు. మంజూరైన నిధులను రాష్ట్ర, జిల్లా రహదారుల పనులకు వేర్వేరుగా కేటాయించారు. ఇందులో భాగంగా, రాష్ట్ర రహదారుల (స్టేట్ హైవేస్) పరిధిలోని 108 పనుల కోసం రూ.400 కోట్లు కేటాయించారు. అదేవిధంగా, వివిధ జిల్లాల్లోని ముఖ్యమైన 166 రహదారుల మరమ్మతుల కోసం రూ.600 కోట్లు కేటాయించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

## రాయవరం ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ఘోర అగ్నిప్రమాదంపై రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనలో ఆరుగురు కార్మికులు సజీవ దహనం కావడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాద ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే పూర్తి సమాచారం సేకరించిందని మంత్రి తెలిపారు. క్షతగాత్రులకు సాధ్యమైనంత ఉత్తమమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. "గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని లోకేశ్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కష్టకాలంలో వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు కాకినాడ, ఉప్పాడలో పవన్ కల్యాణ్ పర్యటన...

పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ముఖ్యంగా, సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని వారు చేస్తున్న ఫిర్యాదులను స్వయంగా పరిశీలించేందుకు ఆయన సముద్రంలోకి వెళ్లనుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, ఉప్పాడ ప్రాంత మత్స్యకారులు చాలా కాలంగా సముద్ర కాలుష్యం వల్ల జీవనోపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య తీవ్రతను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని నిర్ణయించుకున్న పవన్ కల్యాణ్, అధికారులతో కలిసి పడవలో సముద్రంలో ప్రయాణించి కాలుష్య ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటన ద్వారా మత్స్యకారుల వాదనల్లోని వాస్తవాలను గ్రహించి, తగిన చర్యలు చేపట్టాలని ఆయన భావిస్తున్నారు. సముద్ర పర్యటన అనంతరం, పవన్ కల్యాణ్ ఉప్పాడలో మత్స్యకారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. వారి సమస్యలను విని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇవ్వనున్నారు. ఇదే పర్యటనలో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన కూడా చేయనున్నారు.

## షెడ్యూల్ ప్రకారం .. నేడు యథావిధిగా ఎన్నికల నోటిఫికేషన్

కానుంది. రేపు నామినేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభం కానుంది. రేపు ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్‌లు స్వీకరించనున్నారు. తెలంగాణ ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత సర్పంచ్, వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈ నెల 9న ప్రారంభమై నవంబర్ 11న ముగుస్తుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు 9న, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీలు, 27 సర్పంచ్, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రేపు ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 11, ఆ తర్వాత రోజు నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 15న ఉపసంహరణ గడువు ఉంది. రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 13న నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్లకు చివరి తేదీ అక్టోబర్ 15, మరుసటి రోజు నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ గడువు అక్టోబర్ 19.

## ద్రోణి ప్రభావం..

అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం రోజున అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కర్నూలు, అనంతపురం జిల్లాలు మినహా దాదాపు అన్నిచోట్లా పిడుగులతో కూడిన వర్షాలు నమోదయ్యే సూచనలున్నాయని వివరించారు. ఇక రాబోయే మూడు గంటల్లో ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ స్పష్టం చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే

# భారీ విస్ఫోటం

- లక్ష్మీ గణపతి ఫైర్‌వర్క్స్‌లో భారీ అగ్నిప్రమాదం.
- ఏడుగురు దుర్మరణం - పలువురికి తీవ్రగాయాలు
- సహాయక చర్యలో పాల్గొనండి అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- అగ్ని ప్రమాదం ఆవేదన కలిగించింది : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- కొమరిపాలెం దుర్ఘటన స్థలాన్ని పరిశీలించిన హెూం మంత్రి వంగలపూడి అనిత - బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ





**రాయవరం(అనపర్తి) అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మండపేట, అక్టోబర్ 8 (ప్లాష్ న్యూస్):( తెలుగు రాష్ట్రం) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం శివారు వి. సావరం గ్రామం వద్ద ఉన్న శ్రీ గణపతి ఫైర్‌వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన భారీ పేలుడు రాష్ట్రాన్ని కుదిపేసింది. ఈ ఘటనలో ఏడుగురు కూలీలు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ దుర్ఘటనతో కోనసీమ జిల్లా దుఃఖంలో మునిగిపోయింది. ప్రమాదం కారణంగా కేంద్రం పూర్తిగా ధ్వంసమైపోయింది. పేలుడు ధాటికి మంటలు చెలరేగి చుట్టుపక్కల ప్రాంతం అంతా కమ్మేసింది. గాయపడిన వారిలో లింగం చిన్నబాబు, వాసంశెట్టి విజయలక్ష్మి, చిట్టూరి యామిని మొదలైనవారిని కాకినాడ జిజిహెచ్కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

**హెూం మంత్రి పర్యటన**

ఈ ఘటనపై రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత గురువారం కొమరిపాలెం చేరుకొని పేలుడు స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అధికారులు, స్థానిక ప్రజలతో మాట్లాడి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గాయపడిన వారిని ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ భారీ విస్ఫోటం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వచ్చింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం. బాణాసంచా తయారీ కేంద్రాలకు, దుకాణాలకు సంబంధించిన అన్ని భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించాం," అని తెలిపారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. "మృతుల కుటుంబాలకు పరిహారం త్వరలో ప్రకటిస్తాం. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తాం. బాణాసంచా తయారీ కార్మికులకు బీమా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకుంటాం," అని చెప్పారు. అనిత మాట్లాడుతూ, ఈ కేంద్రానికి వచ్చే ఏడాది వరకు చెల్లుబాటు అయ్యే అనుమతి ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల పర్యవేక్షణలో లోపాలు చోటుచేసుకున్నాయని సూచించారు. భవిష్యత్తులో అన్ని తయారీ కేంద్రాలు, దుకాణాలపై విస్తృత తనిఖీలు చేపట్టాలని తెలిపారు.

**అధికారుల సమీక్ష**

ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీఓ దేవరకొండ అఖిల, డీఎస్పీ మురళీమోహన్, అగ్నిమాపక విపత్తుల స్పందన అధికారి సారథి తదితరులు పాల్గొన్నారు. హెూం మంత్రి గాయపడిన వారి ఆరోగ్యం గురించి వైద్యులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ "ఈ ప్రమాదంలో సజీవదహనం అయిన ఆరుగురు కార్మికుల మృతి చాలా బాధాకరం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది," అని మంత్రి తెలిపారు.

**స్థానికుల ఆవేదన**

ప్రతీ సంవత్సరం దీపావళి సీజన్‌లో బాణాసంచా తయారీ పెరుగుతుందని, భద్రతా ప్రమాణాలు కఠినంగా అమలు చేయకపోవడమే ప్రమాదాలకు కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కఠినమైన తనిఖీ విధానం అమలు చేయాలని వారు కోరుతున్నారు.

**సహాయక చర్యలో పాల్గొనాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం**

అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలు, వైద్య సాయంపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వయంగా సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**అగ్ని ప్రమాదం ఆవేదన కలిగించింది**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటు అగ్ని ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం పాలైన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ ప్రమాదంపై జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు అందాయి. ఈ దురదృష్టకర ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశాను. దీపావళి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో, సంబంధిత గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందని తెలిపారు.

**ఘటనా స్థలాన్ని సందర్శించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**

ఘటనా స్థలాన్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సందర్శించారు. 70 సంవత్సరాలుగా బాణాసంచా తయారీలో శ్రీ లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తికి అనుభవం ఉందన్నారు. ఆయన కూడా ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని తెలిపారు. నిబంధనలు అన్నీ కచ్చితంగా పాటించారని ఇటీవల అధికారుల తనిఖీల్లో వెల్లడైందని వివరించారు. అయినప్పటికీ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు.

**బాణసంచా పేలుడు ఘటన పై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి**

కోనసీమలో బాణసంచా పేలుడు ఘటనలో పలువురి మృతిపై వైసిపి అధ్యక్షుడు వైఎస్.జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనలో పలువురు మరణించడం అత్యంత విషాదకరమని అన్నారు. రాయవరంలో జరిగిన ఈ ఘటన అత్యంత దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. మరణించినవారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# ఆత్మనిర్భర్ భారత్ సత్తా ఇదే..

## మన 4జీ టెక్నాలజీ ఎగుమతికి సిద్ధం: ప్రధాని మోదీ

**మేడ్-ఇన్-ఇండియా 4జీ స్టాక్ ఎగుమతికి సిద్ధం**
**ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రధాని మోదీ ప్రకటన**
**దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు చేరిన 5జీ సేవలు**
**భారీగా పెరిగిన మొబైల్ ఫోన్ల తయారీ, ఎగుమతులు**
**ఆసియాలోనే అతిపెద్ద డిజిటల్ ఫోరంగా ఇండియా మొబైల్ కాంగ్రెస్**



**న్యూఢిల్లీ అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

టెలికాం రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని అందుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 'మేడ్-ఇన్-ఇండియా 4జీ స్టాక్' ఇప్పుడు ఎగుమతికి సిద్ధంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రకటించారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 ప్రారంభ సదస్సులో ఆయన మాట్లాడుతూ, 'ఆత్మనిర్భర్ భారత్' దార్శనికతకు ఇది నిదర్శనమని అన్నారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం రంగం అద్భుతమైన పురోగతి సాధించిందని ప్రధాని గుర్తుచేశారు. ఒకప్పుడు 2జీ నెట్‌వర్క్ కోసం ఇబ్బంది పడిన స్థాయి నుంచి నేడు దేశంలోని దాదాపు అన్ని జిల్లాలకు 5జీ సేవలు విస్తరించాయని ఆయన తెలిపారు. "ఒకప్పుడు వెనుకబడిన మనం, ఇప్పుడు చాలా దూరం ప్రయాణించాం. నేడు దేశం నలుమూలలా 5జీ అందుబాటులో ఉంది" అని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా లక్ష టవర్ల ఏర్పాటు ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని, భారీ టెలికాం మౌలిక సదుపాయాలను నిర్మించడంలో మన సామర్థ్యాన్ని ఇది రుజువు చేసిందని పేర్కొన్నారు. ఈ కొత్త 4జీ టెక్నాలజీ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్, నమ్మకమైన సేవలు, అంతరాయం లేని కనెక్టివిటీ సాధ్యమవుతాయని, ఇది టెక్నాలజీలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని మోదీ చెప్పారు. 2014 నుంచి దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ల తయారీ 28 రెట్లు పెరిగిందని ప్రధాని మోదీ గణాంకాలతో వివరించారు. ఇదే సమయంలో మొబైల్ ఎగుమతులు ఏకంగా 127 రెట్లు పెరిగాయని చెప్పడం గమనార్హం. ఈ ఘనత వెనుక స్టార్టప్‌ల ఆవిష్కరణలు, యువత శక్తి ఉన్నాయని ఆయన ప్రశంసించారు. 'డిజిటల్ ఇన్నోవేషన్ స్వేర్', 'టెలికాం టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్' వంటి పథకాలు కొత్త ఆలోచనలకు నిధులు అందించి ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆధునిక చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఇప్పుడు ఆసియాలోనే అతిపెద్ద డిజిటల్ టెక్నాలజీ ఫోరంగా ఎదిగిందని, ఇది దేశ ప్రతిభకు, ఆవిష్కరణలకు ప్రపంచ వేదికగా నిలుస్తోందని మోదీ అన్నారు.

## టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

# శుభాకాంక్షల వెల్లువ



**కొత్తపేట, అక్టోబర్ 8:( తెలుగు రాష్ట్రం )**

తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు బుధవారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. జిల్లాల నలుమూలల నుండి టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, గన్నవరం నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవేంకట సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సుబ్రహ్మణ్యం గారిని శాలువాతో సత్కరించి, గజమాల ధరింపజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో ఆయన నివాసం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా అందరి ప్రేమాభిమానాలకు స్పందిస్తూ రెడ్డి సుబ్రహ్మణ్యం గారు "నాపై చూపిన అభిమానానికి హృదయపూర్వక ధన్యవాదాలు. భవిష్యత్తులో కూడా ప్రజా సేవలో నిబద్ధతతో కొనసాగుతాను" అని తెలిపారు.

## గత ప్రభుత్వంలో పూర్తైంది

# ఆ ప్యాలెస్ మాత్రమే..

## మంత్రి లోకేశ్

**గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రం తిరోగమనం పట్టిందన్న నారా లోకేశ్**
**అమరావతి, పోలవరం ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని తీవ్ర విమర్శ**
**రూ.550 కోట్ల ప్యాలెస్ తప్ప ఏ ప్రాజెక్టూ పూర్తి కాలేదని ఆరోపణ**
**అధికారంలోకి వచ్చాక రూ.10.7 ట్రిలియన్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడి**
**'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పునరుద్ధరణే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ**

**అమరావతి, అక్టోబర్ 08 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని, రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిన్నదని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్'ను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే భారీగా పెట్టుబడులను ఆకర్షించామని ఆయన తెలిపారు. ప్రముఖ జాతీయ ఆంగ్ల పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్' కోసం రాసిన ప్రత్యేక వ్యాసంలో లోకేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణానికి సింగపూర్ భాగస్వామ్యాన్ని రద్దు చేయడం, అంతర్జాతీయ సంస్థలతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను వెనక్కి తీసుకోవడం వంటి చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతిన్నదని ఆయన ఆరోపించారు. తమ హయాంలో 72 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టు పనులు, గత ఐదేళ్లలో కేవలం 3 శాతమే ముందుకు సాగాయని విమర్శించారు. ఆ కాలంలో విజయవంతంగా పూర్తయిన ఏకైక ప్రాజెక్టు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కోసం కట్టిన రూ.550 కోట్ల ప్యాలెస్ మాత్రమేనని లోకేశ్ ఎద్దేవా చేశారు. 2024లో చారిత్రక తీర్పుతో తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం, ప్రతిష్టను పునర్నిర్మించడంపై దృష్టి సారించామని తెలిపారు. గడిచిన 17 నెలల్లోనే రూ.10.7 ట్రిలియన్ల విలువైన పెట్టుబడులను ఖరారు చేశామని, అనేక ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎల్జీ, ఆర్సెలర్ మిట్టల్ వంటి ప్రఖ్యాత సంస్థలు ముందుకు వస్తున్నాయని, ఇది తిరిగి వస్తున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో పెట్టుబడులను మరింత ఆకర్షించేందుకు, నవంబర్ 14, 15 తేదీల్లో వైజాగ్‌లో 'సీఐఐ భాగస్వామ్య సదస్సు' నిర్వహించనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. మరో రూ.10 ట్రిలియన్ల పెట్టుబడులను సాధించడమే లక్ష్యంగా ఈ సదస్సు ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఒక స్టార్టప్ కంపెనీలా వేగంగా, క్రమశిక్షణతో పనిచేస్తుందని, పెట్టుబడిదారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి తాను వ్యక్తిగతంగా వాట్సాప్‌లో అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ దేశ ప్రగతికి దోహదపడుతుందని, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి తమకు పూర్తి సహకారం అందుతోందని లోకేశ్ తన వ్యాసంలో పేర్కొన్నారు.

## ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీరు...

# రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్

**2025 సంవత్సరానికి రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రకటన**
**సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ యాఘీలకు సంయుక్తంగా పురస్కారం**
**'మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' అభివృద్ధికి గాను ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు**
**ఎడారి గాలి నుంచి నీటిని సేకరించే టెక్నాలజీ ఆవిష్కరణ**
**కర్బన ఉద్గారాలను బంధించడంలో, కాలుష్య నివారణలో కీలకం**
**మానవాళి సవాళ్లకు పరిష్కారం చూపే ఆవిష్కరణగా ప్రశంసలు**




ఎడారి గాలి నుంచి స్వచ్ఛమైన నీటిని సేకరించడం, వాతావరణంలోని హానికర కర్బన ఉద్గారాలను బంధించడం వంటి అసాధారణ పనులకు వీలు కల్పించే వినూత్న ఆవిష్కరణకు ఈ ఏడాది రసాయన శాస్త్రంలో అత్యున్నత పురస్కారం లభించింది. 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జపాన్‌కు చెందిన సుసుము కిటగావా, ఆస్ట్రేలియాకు చెందిన రిచర్డ్ రాబ్సన్, అమెరికాకు చెందిన ఒమర్ ఎం. యాఘీలను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బుధవారం ప్రకటించింది. 'మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్' (MOF)గా పిలిచే ప్రత్యేకమైన అణు నిర్మాణాలను అభివృద్ధి చేసినందుకు గాను వారికి ఈ గౌరవం దక్కింది. ఈ శాస్త్రవేత్తలు లోహ అయాన్లను (మూలస్తంభాలుగా), పొడవైన కర్బన అణువులతో (సంధానకర్తలుగా) కలిపి సూక్ష్మస్థాయిలో ఖాళీలతో కూడిన స్ఫటికాలను రూపొందించారు. ఈ ఖాళీలు వాయువులు, ఇతర రసాయనాలను నిల్వ చేయడానికి లేదా రసాయనిక చర్యలు జరపడానికి గదుల్లా పనిచేస్తాయి. వీటిని ఉపయోగించి పర్యావరణంలోని విషవాయువులను నిల్వ చేయడం, నీటిలోని హానికర రసాయనాలను వేరుచేయడం, ఫార్మా వ్యర్థాలను విచ్ఛిన్నం చేయడం వంటి ఎన్నో క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనవచ్చు. ఈ రంగంలో 1989లో రిచర్డ్ రాబ్సన్ తొలి అడుగులు వేయగా, ఆ తర్వాత సుసుము కిటగావా, ఒమర్ యాఘీ తమ పరిశోధనలతో దీనిని మరింత ముందుకు తీసుకెళ్లారు. కిటగావా ఈ నిర్మాణాల్లోకి వాయువులు స్వేచ్ఛగా ప్రవహిస్తాయని నిరూపించగా, యాఘీ అత్యంత స్థిరమైన MOFలను సృష్టించి, వాటిని మనకు కావాల్సిన విధంగా మార్చుకునే పద్ధతిని ఆవిష్కరించారు. వీరి కృషి ఫలితంగా ఇప్పటివరకు పదివేల రకాలకు పైగా MOFలు రూపుదిద్దుకున్నాయి. "మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మనకు అవసరమైన సరికొత్త ప్రయోజనాలతో పదార్థాలను రూపొందించుకోవడానికి ఇవి ఊహించని అవకాశాలను అందిస్తున్నాయి" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే ఈ సందర్భంగా ప్రశంసించారు.









విజయవాడలో పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

తెలుగురాష్ట్రం దినపత్రిక


## జడ్పీ హైస్కూల్‌లో క్రీడా పోటీలలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి



**పి.గన్నవరం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేకరి):** జిల్లా పరిషత్ హై స్కూల్ నందు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-15 బాలురు, బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు మరియు ఎంపిక కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "క్రీడల ద్వారా విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసిక వికాసం పొందగలరని క్రీడల వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం ఉంటుందని ఈ పోటీల్లో ప్రతి ఒక్క విద్యార్థి తన ప్రతిభను చాటాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే స్వయంగా వాలీబాల్ మరియు కబడ్డీ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడుతూ అందరిలో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సేవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తన దాతత్వం చాటుకున్న అభిషేక్ బాబు



**టీ. నర్సాపురం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేఖరి):** బొర్రంపాలెం గ్రామంలో స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత యువ నేత పెండ్యాల అభిషేక్ బాబు మరొకమారు తన దాతృత్వాన్ని చూపారు. బొర్రంపాలెం గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగానూ, కలుషిత మంచినీరు, మురుగు నీళ్లలో దోమల వ్యాప్తి వల్ల గత నెల రోజులుగా ప్రతీ ఇంటిలోనూ జ్వరాలు, డయేరియా లక్షణాలతో, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు ఆసుపత్రిలో చేరి ఆర్థికంగానూ, శారీరకంగా చితికి పోతున్న తరుణంలో... అభిషేక్ బాబు ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా హుటాహుటిన తన యూత్ సహకారంతో దోమల నివారణకు మలాథియన్ ను పంచాయతీ మొత్తం పిచికారీ చేయించడం మొదలు పెట్టారు. నాయకులు, పంచాయతీ వారు పట్టించుకోక పోయినా... అభిషేక్ బాబు ప్రజలకు చేస్తున్న సేవలకు అందరూ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## అటవీ అభివృద్ధి సంస్థలో
# జామాయిల్ మాయం



**జీలుగుమిల్లి, అక్టోబర్8 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండలంలోని అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన జామాయిల్ ప్లాంటేషన్ లో జామాయిల్ బాదులు అక్రమంగా నరికి దుండగులు తరలించకపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ప్రకారం సంభాషణ అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన పాలచర్ల రాజవరం గ్రామ సమీపంలో 56 హెక్టార్లలో ఉన్న జామాయిల్ ప్లాంటేషన్ లో గత పది రోజుల క్రితం పెద్ద మొత్తంలో జామాయిల్ బాదులు కొంత మంది అక్రమార్కులు నరికి తరలించకపోయినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇలా కొన్నిచోట్ల నరికిన జామాయిల్ మొదళ్ళ పై అడవి అభివృద్ధి సంస్థ సిబ్బంది నంబర్ రింగ్ ఇచ్చారు. ఇదే విషయంపై డిపిఎం రెహమాన్ ను వివరణ కోరగా ప్లాంటేషన్ జామాయిల్ అక్రమ నరికివేత వాస్తవం కాదని, అవి పాతవి అని తెలిపారు. ఈ మధ్యకాలంలో 20 చెట్లు నరికివేతకు గురయ్యాయని, వీటిని ఎవరు నరికారో, గుర్తించి పట్టుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తాం
### -ఎంపీడీవో రాంప్రసాద్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేకరి):** అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేస్తామని పెంటపాడు మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ తెలిపారు. మండలంలోని పరిమెళ్ల, యాణాలపల్లి గ్రామాల్లో కొత్తగా పింఛన్ల కోసం ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ఆయన బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న లబ్ధిదారులందరికి పింఛన్లను త్వరలోనే అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు గొర్రెల వెంకట కోటేశ్వరరావు, గోకా ఛాయాదేవి, కూటమి నాయకులు గోకా ముసలి సత్యనారాయణ, గంజి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు నాగదేవి, ప్రమీల రాణి, జూనియర్ సహాయకులు సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సి, ఎస్‌టి నోటీసులను పట్టించుకోని కలెక్టర్ పై చర్యలు తీసుకోండి




**కూనవరం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఐటీడీఏ పరిధిలో పర్యటించిన జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్(ఎన్ సిఎస్ టి ) సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ వారికి ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నెలకొన్న పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేసి సమస్యల వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కమిషన్ సభ్యులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పూర్తిగా ఐదో షెడ్యూల్ భూభాగమని ఈ ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలులో ఉందని ఈ చట్టం ప్రకారం నాన్ ట్రైబల్స్ భూములు అమ్మకాలు కొనుకొల్లు పూర్తిగా నిషేధమని అయినప్పటికీ నాన్ ట్రైబల్స్ మధ్య భూ బద్దలయింపులు జరుగుతున్నాయని తెలియజేశారు. అలాగే ప్రభుత్వ, ఆదివాసి, మరియు ఆర్ అండ్ బి స్థలాలు మరి ఇతర ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు కూడా పూర్తిగా నిషేధమని కానీ అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాన్ ట్రైబల్స్ విచ్చలవిడిగా బయట ప్రాంతం నుంచి వలసలు వచ్చి ప్రభుత్వ భూములు, ఆదివాసి భూములను కబ్జాలు-ఆక్రమణలు చేసి స్థిర నివాసాలు, అక్రమ కట్టడాలు కట్టి వ్యాపారాలు చేయటం, వ్యవసాయాలు చేయటం చేస్తున్నారని ఆయన కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అక్రమ కట్టడాలు కూల్చివేయాలని పలు చట్టాలు జీవోలు ఏజెన్సీలో ఉన్నప్పటికీ ఇక్కడ రెవెన్యూ పంచాయతీ అధికారులు వాటిని అమలు చేయకుండా అక్రమ కట్టడాలను గుర్తించి కూడా వాటిని కూల్చకుండా అక్రమ కట్టడాలు కట్టిన నాన్ ట్రైబల్స్ తోటి ముడుపులకు అలవాటు పడి నాన్ ట్రైబల్స్ కి వత్తాసు పలుకుతున్నారని ఆయన తెలియజేశారు. ఎల్టీఆర్ వైలేషన్ పై ఆదివాసి సంక్షేమ పరిషత్ గతంలో కూడా ఎన్ సిఎస్టీలో ఫిర్యాదు చేసిందని, అప్పుడు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఎస్డీసీ వ్యవస్థ ఎల్టీఆర్ చట్టంని పటిష్టంగా అమలు చేస్తుందని తప్పుడు నివేదికలు ఇచ్చారని ఆయన కమిషన్ సభ్యులకు వివరాలను చూపించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్స్ ఎల్ టి ఆర్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నప్పుడు ఏజెన్సీ ఏరియాలో వేలాది ఎల్ టి ఆర్ కేసులు పెండింగ్లో ఉండవలసిన అవసరం ఏముందని సుమారుగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో గుర్తించిన 1000కి పైగా నాన్ ట్రైబల్స్ అక్రమ కట్టడాల జాబితాను కమిషన్ కు అందజేసినట్లు ఆయన తెలియజేశారు. ఎస్ డి సి వ్యవస్థ ఏజెన్సీలో పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని ఎల్ టి ఆర్ కేసులు వల్ల లాయర్లు, నాన్ ట్రైబాల్స్ లబ్ధి పొందుతున్నారు తప్ప ఆదివాసులకు ఎటువంటి న్యాయం జరగటం లేదని ఆయన అన్నారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు కింద ముంపుకు గురైన దేవి పట్నం, పోలవరం, చింతూరు, వర రామచంద్రపురం, కూనవరం, ఎటపాక, వేలేరుపాడు మరియు కుక్కునూరు మండలంలోని 1/70 చట్టానికి విరుద్ధంగా వలస వచ్చిన నాన్ ట్రైబల్స్ ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వాటి నుండి కోట్ల రూపాయల పోలవరం పరిహారాన్ని అక్రమ మార్గంలో పొంది ఉన్నారని కమిషన్ల కోసం కక్కుతి పడి అధికారులు అర్హత లేని నాన్ ట్రైబల్స్ కు ప్రభుత్వ ధనాన్ని అధికారులు దోచి పెట్టారని ఆయన కమిషన్ కి తెలియజేశారు. పలు ఆధారాలతో కూడిన పోలవరం భూకంభకోణాలు మరియు కోట్ల రూపాయల పరిహారం పొందిన నాన్ ట్రైబల్స్ జాబితాను కమిషన్ కు అందజేయడం జరిగింది. అలాగే రంపచోడవరం నియోజకవర్గంలో మైనింగ్ మాఫియా చెలరేగిపోతుందని ఏజెన్సీ ప్రాంతాల్లో నాన్ ట్రైబల్స్ కి ఎటువంటి అర్హతలు లేకపోయినా స్థానిక అధికారులు వాళ్లకి ఎన్ఓసిలు ఇచ్చి మైనింగ్ చేయిస్తున్నారని ఉదాహరణగా రంపచోడవరం మండలం నరసాపురం బ్లాక్ మెటల్ క్వారీ కి సంబంధించిన వివరాలను అందజేయడం జరిగింది. ఈ క్వారీ విషయంలో ఎన్ సిఎస్టీ నుండి జిల్లా కలెక్టర్ కు నోటీసులు అందిన ఇప్పటివరకు దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఎన్ సిఎస్టీ నోటీసులు సైతం దిక్కరించిన అల్లూరి జిల్లా కలెక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కమిషన్ కోరారు. స్పందించిన కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు ఆయన ప్రకటన ద్వారా తెలిపారు.

## ఆర్‌అండ్‌బి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**టి.నరసాపురం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేఖరి):** బొర్రంపాలెం గ్రామం నుండి రావికంపాడు గ్రామం వరకు రూ.4 కోట్ల 22 లక్షల అంచనా వ్యయంతో నిర్మించబడనున్న ఆర్ %c% బి రోడ్డుకు శంకుస్థాపన చేసిన పోలవరం ఎమ్మెల్యే శ్రీ చిర్రి బాలరాజు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సౌకర్యం కోసం రోడ్ల మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు మెరుగుపడితే ప్రజల ఆర్థికాభివృద్ధి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి దారితీస్తుందని ఆయన అన్నారు.రాబోయే నెలల్లో ఈ ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి కట్టుబడి ఉందని, అభివృద్ధి పథకాల అమలులో ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అడపా నాగరాజు,నాయుడు రామకృష్ణ గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు హరిబాబు, కూటమి సీనియర్ నాయకులు శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామ్మూర్తి, పిన్నమనేని మధు, నాయకులు కంపసాటి రమేష్, నాలి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కొల్లికి సత్కారం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడిగా పదవి పొందిన బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కొల్లి రాజశేఖర్ కు బంగారు గూడెం అరుంధతి పేటలో బుధవారం ఘన సత్కారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పోలిపో అరుణ్ ఆధ్వర్యంలో గ్రామంలో అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రాజశేఖర్ ను బిజెపి మండల అధ్యక్షుడు సమయమంతుల దుర్గా కాశీ విశ్వేశ్వరరావు, కార్యదర్శి నెల్లూరు శ్రీనివాస్, కొడవటి రాజేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కండెల్లి రాజేష్, దూలపల్లి ఆనంద్, పెంటపాడు ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాత కాకుల నాగరాజు, ఉలంపర్తి ఏసేపు తదితరులు అభినందించారు.

## విద్యార్థుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కల్పన షైని



**కూనవరం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేఖరి):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టి ఎల్ శిక్షణా కార్యక్రమంలో శ్రీమతి కల్పన సైని సందర్శించారు. ఈ శిక్షణ కార్యక్రమం గురించి ఉపాధ్యాయులను మరియు ఈ ట్రైనింగ్ యొక్క ఆవశ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. తరల్ టిఎల్ఎం యొక్క ఆవశ్యత గురించి ఆమెకు వివరించారు. ప్రాథమిక పాఠశాలల, ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కనీస సామర్థ్యాలు సాధించేటట్టుగా ఉపాధ్యాయుల కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వివి లక్ష్మీనారాయణ, టి. లక్ష్మయ్య, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## కూటమి నాయకులతో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం
### శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేకరి):** రాజకీయాలను పక్కనపెట్టి కూటమి నాయకులంతా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి నాయకులంతా తనకు సమానమేనని, పార్టీలకు అతీతంగా అభివృద్ధిని సాధించడమే తన లక్ష్యమని అన్నారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లుగా అభివృద్ధిని గాలికి వదిలేయడంతో ప్రజల ఎన్నో అవస్థలు పడ్డారన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను వేరే కార్యక్రమాలకు మళ్ళించి, ఎస్సీ వర్గాలకు అన్యాయం చేశారని చెప్పారు. సర్పంచ్లు, ఎంపీటీసీలను నామమాత్రం చేసి, ప్రజల ముందుకు వెళ్లలేని పరిస్థితి కల్పించారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో పంచాయతీలను అభివృద్ధి బాట పట్టించామన్నారు. ఎస్సీ కాలనీలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రోడ్లు, డ్రైనేజీ ల నిర్మాణాన్ని చేపట్టామని తెలిపారు. పెంటపాడులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సర్పంచ్ తాడేపల్లి సూర్య కళ, తాడేపల్లి ఈశ్వరరావు, తాడేపల్లి వంశి కుటుంబం రూ 10 లక్షలు విరాళాలు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. నిర్మాణానికి ఎంపీ నిధులు రూ 25 లక్షలు మంజూరు చేయవలసిందిగా తాను ఎంపీని కోరానని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్య కళ, ముదునూరు సొసైటీ చైర్మన్ దాసరి అప్పన్న, కూటమి నాయకులు కిలపర్తి వెంకట్రావు, కసిరెడ్డి మధులత, దత్తు ప్రసాద్, కొనకళ్ళ హరినాథ్, కొవ్వూరి లక్ష్మణ్ రెడ్డి, నల్లమిల్లి గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం
### -ఎమ్మెల్యే రోషన్ కుమార్



**జంగారెడ్డిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** వృద్ధులు సమాజంలో మార్గ దర్శకులు అని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలో రోటరీ క్లబ్ లో ప్రపంచ వృద్ధాప్య దినోత్సవం పురస్కరించుకొని జరిగిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు.వృద్ధులు విజ్ఞాన గనులని, వారి జీవితంలో అనేక అనుభవాలు, ప్రావీణ్యాలు కలిగి ఉంటారని, వారి అనుభవాలను నేటి యువత వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నతమైన జీవిత విధానాలతో ముందుకు సాగాలని కోరారు. బాపూజీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించబడటం అభినందనీయమన్నారు.అనంతరం రోటరీ క్లబ్ నిర్వాహకులకు సన్మానం చేసి గౌరవించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, సీనియర్ సిటిజెన్స్ పాల్గొన్నారు.

## తగ్గించిన జీఎస్టీతో ప్రతి కుటుంబానికి లబ్ధి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేకరి):** ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో ప్రతి కుటుంబానికి లబ్ధి కోరుతుందని పంచాయతీ కార్యదర్శి డి. నాగదేవి తెలిపారు. పెంటపాడు మండలం పరిమేళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమమంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.కాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగదేవి మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. తగ్గించిన వస్తు సేవల పన్నుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సూర్యచంద్రరావు, కార్యదర్శి ప్రమీల రాణి, సచివాలయ సిబ్బంది సతీశ్, సంధ్య శ్రీనివాసరావు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ చోర్.. గద్దె చోడ్.. పేరుతో టీకే ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 8(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడి ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగించిందని రాష్ట్ర పీసీసీ కార్య నిర్వాహక అధ్యక్షులు జేడీ శీలం ఆక్షేపించారు. బుధవారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న కృష్ణ సాయి కల్యాణ మండపం లో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు టీకే విశ్వేశ్వర రెడ్డి తదితరుల కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. బీహార్ లో 60 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపించారు. కర్నాటకలో 6 వేల ఓట్లు తొలగించారని, నకిలీ ఓట్లు భారీగా నమోదు అయ్యాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం చేష్టలుడిగి చూస్తోందని తీవ్రంగా ఆక్షేపించారు. జరిగిన లోపాలపై ఈసీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నిస్తే మౌనం వహిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ ఇచ్చిన " ఓట్ చోర్..గద్దె చోడ్" నినాదంతో తూర్పు గోదావరి జిల్లాలో లక్ష సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఐదు డిమాండ్లతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తూ సంతకాల సేకరణ చేస్తున్నామని చెప్పారు. దేశ వ్యాప్తంగా 5 కోట్ల సంతకాలను రాహుల్ గాంధీ నేతృత్వంలో ఈసీకి అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన జిల్లా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో జేడీ శీలం సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి విశ్వేశ్వర రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి సాదర స్వాగతం పలికారు. ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ మాట్లాడుతూ బీహార్, కర్నాటక, మహారాష్ట్రలో జరిగిన ఓట్ల దొంగతనం, నకిలీ ఓట్ల నమోదుపై గణాంకాలతో వివరించారు. ఈ విధానం ప్రజల హక్కులను కాల రాసిందని, తద్వారా భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసిందని ఆమె దుయ్యబట్టారు. బీహార్ లో సాలీనా రూపాయి లీజుకు 150 ఎకరాలను ప్రభుత్వం కట్టబెట్టిందని ఆరోపించారు. దేశంలో ముగ్గురు బడా వ్యాపారుల కన్నుసన్నలలో కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. కర్నాటకలో మహదేవ్ పురలో చిన్న గది లాంటి ఇంట్లో సుమారు 60 నుంచి 80 నకిలీ ఓట్లు నమోదు చేశారని, ఆ ఇల్లు బీజేపీకి చెందిన వ్యక్తికి చెందినదని పాలక్ వర్మ దుయ్యబట్టారు. అనంతరం పేపర్ మిల్లు వద్ద టీకే విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జేడీ శీలం ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కె.శివాజీ, అరిగెల అరుణ కుమారి, మార్టిన్ లూథర్, అమరజహా బేగం, బాలేపల్లి మురళీధర్, బోడా వెంకట్, మోతా శారద, బేగ్, డాక్టర్ వడయార్ తదితరులు పాల్గొన్నారు.

### నిట్ లో 10, 11వ తేదీల్లో అలరించనున్న

# టెక్రియా 2కె25 కార్యక్రమాలు

### ఘనంగా కర్టెన్ రైజర్ కార్యక్రమం

**తాడేపల్లిగూడెం, అక్టోబర్8 (తెలుగురాష్ట్రం విలేకరి):** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో ఈ నెల 10, 11వ తేదీల్లో రెండు రోజులపాటు నిర్వహించనున్న టెక్రియా 2కె245 కార్యక్రమాలు అలరించనున్నాయి. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ప్రాంగణంలోని గ్రంధాలయం వద్ద ఏర్పాటుచేసిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సమాజహిత పరిశోధనలపై దృష్టిసారించాలని వివరించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి కోఆర్డినేటర్ గా వ్యవహరిస్తున్నారు. ముందుగా విద్యార్థులు నృత్యాలు చేయడంతోపాటు తమ ఆటపాటలతో చూపరులను మైమరిపించారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కే.హిమబిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ శీనివాసన్, ఆచార్యులు డాక్టర్ టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.




**టెక్రియా కార్యక్రమాలు..**

ఈ నెల 10,11న నిర్వహించనున్న టెక్రియా కార్యక్రమాల వివరాలిలా ఉన్నాయి. రోబోటిక్స్, ఆటోమేషన్, అల్టిమేట్ డ్రోన్, డ్రోన్ చాలెంజ్, సెరెనిటీ రూమ్, ఇంజనీర్స్ డ్రైవ్ వే, రిథమ్ రియాల్టీ, షేర్ లాక్డ్, షార్ట్ ఫిలిం, గైరో మేజ్ ఛాలెంజ్, డిస్ ఎక్ట్రీమ్, టెక్ ఎక్స్పో, ఎరిస్, మెటీరియల్ మైండ్స్ పోస్టర్ షో కేస్, కాస్ ఏ థాన్, డ్రోన్ వర్క్ షాప్, హెూవర్ నోవ, నేచర్ హంట్, బింగో బ్లోసమ్, కెరీర్ గ్యాలరీ, షఉట్ ద వరల్డ్, టిక్ ఆర్కేడ్, విజనరీ, ఎఫ్ 1 ద రేస్, స్టార్ట్ అప్ ఎస్కేప్ రూమ్, ఇన్నోవేషన్ ఎక్సుహిబిట్, సాయంత్రం సాంస్కృత కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

## ఆక్వా చెరువులు సాగుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి, వెంటనే అప్సడ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి..

### .జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, అక్టోబర్8 (తెలుగురాష్ట్రం విలేకరి):** జిల్లాలోని ఆక్వా చెరువులు సాగుదారులు తప్పనిసరిగా అప్సడ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ) కింద నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 50 వేల ఎకరాల ఆక్వా చెరువులను అప్సడ క్రింద నమోదు చేసుకోవడం జరిగిందని, ఇంకా సుమారు 83 వేల ఎకరాల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవలసిందని తెలిపారు. "అప్సడ" లో రిజిస్టర్ అయిన వారు మాత్రమే పవర్ సబ్సిడీ, తదితర ప్రభుత్వ రాయితీలను పొందగలరు అన్నారు. అలాగే ఆక్వా ఉత్పత్తుల ఎగుమతికి కూడా అప్సడ లైసెన్స్ తప్పనిసరి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్లు ఒక మాసం లోపు పూర్తి చేయాల్సిందిగా ఆదేశించడం జరిగిందన్నారు. ఇప్పటికే 20 రోజులు గడువు ముగిసింది అన్నారు. అప్సడ రిజిస్ట్రేషన్ లేకుండా ఆక్వా ఉత్పత్తులు సాగుచేస్తే అట్టివారికి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధించడం జరుగుతుందని తెలిపారు. రానున్న వారం రోజుల్లోపుగా ఆక్వా రైతులు విధిగా అప్సడ రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతు ఎకరానికి ఒక వెయ్యి రూపాయలు రుసుము చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ఎఫ్ఎంబి, పట్టాదారు పాస్ బుక్/ఆర్ఓఆర్/అడంగల్, ఆధార్ కార్డ్, లైవ్ ఆటో కాడ్, లీజ్ హెూల్డర్ అయితే లీజు అగ్రిమెంటును సంబంధిత సచివాలయాలలో అందజేసి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్లైన్లో ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అప్సడ రిజిస్ట్రేషన్ లను వెంటనే పూర్తి చేసుకొని ప్రభుత్వ రాయితీలను పొందాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.

# నూతన వైద్య సేవలతో యశోద హాస్పిటల్

## ఎంఆర్ లైనాక్ తో రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది



**రాజమండ్రి, అక్టోబర్8 (గోదావరి ప్రతినిధి):** యశోదా హాస్పిటల్స్ %-% హైటెక్ సిటీలో సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు, క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సునీత- ఎంబిబిఎస్, ఎండీ , డి ఎన్ బి ఎఫ్ ఆర్ సి ఆర్ (యుకే) మాట్లాడుతూ ఎమ్మార్ లైనాంక్ తో రేడియేషన్ చికిత్సలో కొత్త యుగానికి నాంది అని వివరించారు. నూతన వైద్య సేవల గురించి వివరించారు. సాధారణంగా రేడియేషన్ థెరపీ తీసుకునే రోగులకు చాలా టెన్షన్ ఉంటుంది. రేడియేషన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయనే బావన బాధితులలో ముద్రించి పోయిందని పేషంట్లలో ఇలాంటి ప్రశ్నలు చాలా సాధారణంగా ఉంటాయని అన్నారు. అలాంటి భయాలను తగ్గించి, మరింత కచ్చితమైన, సురక్షితమైన రేడియేషన్ చికిత్స అందించడానికి మేము ఎంఆర్ లైనాక్ అనే అత్యాధునిక టెక్నాలజీని యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీలో ప్రవేశపెట్టామని ఆమె వివరించారు. హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ లో ఉపయోగిస్తున్న ఎం ఆర్ లినంక్ సేవలు గురించి డాక్టర్ సునీత వివరిస్తూ.. ఇది ప్రపంచంలోని అత్యాధునిక రేడియేషన్ యంత్రాలలో ఒకటి అని ఇందులో రెండు సాంకేతిక పరిజ్ఞానాలు ఎమ్.ఆర్.ఐ స్కాన్, లీనియర్ యాక్సిలేటర్ (లినాంక్)లు ఒకే యంత్రంలో పనిచేస్తాయని, దీని ప్రత్యేకత ఏమిటంటే, ప్రతి రోజూ ట్రీట్మెంట్ ప్రారంభం కాక ముందే రోగికి ఆటోమేటిక్‌గా ఎమ్.ఆర్.ఐ స్కాన్ జరుగుతుందని, దాంతో ఆ రోజు ట్యూమర్ యొక్క ఆకారం, సైజు, స్థానం వంటి వివరాలు స్పష్టంగా తెలుస్తాయని, దీని ఆధారంగా రేడియేషన్ కేవలం ట్యూమర్ ఉన్న ప్రాంతానికే ఇవ్వబడుతుందని, పక్కన ఉన్న ఆరోగ్యకరమైన అవయవాలపై ఎటువంటి ప్రభావం ఉండదని ఆమె వివరించారు. సాధారణ రేడియేషన్ థెరపీలో పేషెంట్లకు తలనొప్పి, స్కిన్ ఇర్రిటేషన్, బలహీనత, వాంతులు, మూత్రంలో లేదా మోషన్‌లో రక్తం వంటి సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చునని, కాని ఎంఆర్ లైనాక్ టెక్నాలజీతో ఇవన్నీ చాలా వరకు నివారించవచ్చునని, ఇది ప్రతి రోజూ శరీరంలోని మార్పులను గుర్తించి చికిత్సను ఆ మేరకు సర్దుబాటు చేసే సామర్థ్యం కలిగిన యంత్రమని క్షుణ్ణంగా మీడియాకు వివరించారు. ఎంఆర్ లైనాంక్ ట్రీట్మెంట్ సమయం చాలా తక్కువ ం కొన్ని సందర్భాల్లో కేవలం ఐదు రోజుల్లోనే పూర్తి చికిత్స పూర్తవుతుందని, ఇది రోగులకు మానసికంగా, శారీరకంగా కూడా పెద్ద ఉపశమనం ఇస్తుందని డాక్టర్ సునీత తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ సునీత, యశోద హాస్పిటల్ - హైటెక్ సిటీ డిజియం సంతోష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ మార్కెట్ టీం లీడర్ ఎన్. బాల వీరబద్ర, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ షరీఫ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## "మహానాగు" సినిమాకు క్లాప్ కొట్టిన బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం విలేకరి):** యాంత్రిక ప్రపంచంలో దైవస్మరణ మరిచి దైనందిన జీవితంలో పరుగులు తీస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు మహానాగు సినిమా ద్వారా దైవ భక్తిని మరోసారి చాటి చెప్పనున్నారని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలం రాచర్ల గ్రామంలో శ్రీ కృష్ణాశ్రమం, శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారిని బుధవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో మహానాగ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా భగవంతున్ని ప్రజలందరూ కొలిచే విధంగా మహానాగు సినిమా ద్వారా చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ప్రముఖ నిర్మాత అంబికా కృష్ణ మాట్లాడుతూ దేవుడు సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ ఉంటుందని, కాంతారా, మహానరసింహ మిరాజ్ వంటి సినిమాలు సాధించిన ఘన విజయాలే అందుకు నిదర్శమని చెప్పారు. కాంతారా సినిమా విడుదలైన 10 రోజుల్లోనే రూ 400 కోట్లు వసూలు చేసిందని చెప్పారు. ఎంతసేపు మిషన్ గన్ లు, కత్తులతో నరుక్కోవడం, చంపుకోవటం వంటివి చూస్తుంటే నిర్మాతలకే చిరాకు వస్తుందని చెప్పారు. దైవత్వం, సంస్కృతి, సంప్రదాయాలను జోడించి సినిమాలు తీస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తాయని తెలిపారు. మహానాగు సినిమా ఘనవిజయాన్ని సాధించి, వందరోజుల పండుగ చేసుకోవాలని ఆకాంక్షించారు. సినిమాలో నటిస్తున్న హీరో హీరోయిన్లతో పాటు డైరెక్టర్ సాంకేతిక నిపుణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సినిమా డైరెక్టర్ పువ్వాడ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ దైవత్వం, సైన్సు, సస్పెన్స్ థ్రిల్లర్ ని ముడిపెట్టి మహానాగు సినిమా తీస్తున్నామని తెలిపారు. సుబ్రమణ్య స్వామి పై తమిళంలో సినిమాలు తీస్తే తెలుగులోకి అనువాదమయ్యాయి తప్పా నేరుగా తెలుగులో సినిమా ఇంతవరకు రాలేదని చెప్పారు. భీమవరం టాకీస్ పై నిర్మిస్తున్న ఈ సినిమాకి తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మతగా వ్యవహరిస్తున్నారని వివరించారు.

# వాహనాలు తనిఖీలు

**చింతలపూడి, అక్టోబర్ 8 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాల నివారణకు, అక్రమ రవాణా నిర్మూలనకు బుధవారం తెల్లవారుజామున లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రాత్రి పూట మరియు తెల్లవారుజామున డ్రైవింగ్ చేసే వాహనదారులు అలసట/నిద్ర మత్తు వలన ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు "ఫేస్ వాష్ కార్యక్రమం" నిర్వహించారు. వాహనదారులకు నిద్ర మత్తులో డ్రైవింగ్ ఎంత ప్రమాదకరమో వివరించి, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రహదారి ప్రమాదాల నివారణ కొరకు ప్రజలు పాటించవలసిన ముఖ్య సూచనలు: నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయకూడదు డ్రైవింగ్ ప్రారంభించే ముందు తగిన విశ్రాంతి తీసుకోవాలి. అధిక వేగంతో వాహనాలు నడపకూడదు, వేగం తగ్గిస్తే ప్రాణాలు కాపాడతాయి. హెల్మెట్ %ఒ% సీట్‌బెల్ట్ తప్పనిసరి %-% చిన్న దూరం ప్రయాణమైనా జాగ్రత్త తప్పక పాటించాలి. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదు ఇది కేవలం చట్టపరమైన నేరం కాదు, ప్రాణహాని కలిగిస్తుంది. రాత్రివేళల్లో లైట్లు సరిగా వాడాలి హై బీమ్ లైట్లు అవసరమైతే మాత్రమే వాడాలి. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 112 కు సమాచారం అందించాలి. ప్రజల ప్రాణాలు, ఆస్తి రక్షణకు ఏలూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉందని, ప్రతి ఒక్కరు రహదారి భద్రతా నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించాలని చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు.




## పాఠశాలలను పర్యవేక్షించిన మండల విద్యాశాఖ అధికారి

**తెలుగు రాష్ట్రం కుక్కునూరు:** ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాశాఖ అధికా రి (%MEO% -1) కృష్ణ ప్రసాద్ మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాల రామసింగారం ను పర్యవేక్షణ చేశారు . మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు . పిల్లలకు మెనూ ప్రకారంగా మధ్యాహ్నం భోజనం అందించాలని సూచించారు పాఠశాలలో ఉన్న రికార్డుల పరిశీలించారు . విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులు తెలియజేశారు





### పీఎం మత్స్య సంపద యోజన పథకానికి

# విరివిగా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలి



**భీమవరం, అక్టోబర్8 (తెలుగురాష్ట్రం విలేకరి):** పీఎం మత్స్య సంపద యోజన పథకానికి విరివిగా దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన పీ.ఎం.ఎం.ఎస్.వై పథకం అమలుపై జిల్లా స్థాయి సమావేశాన్ని సంబంధిత కమిటీ సభ్యులతో నిర్వహించి సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పి.ఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా వివిధ సబ్సిడీ రుణాలను పొంది లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పీఎంఎంఎస్ వై పథకం ద్వారా రుణాన్ని పొందే జనరల్ కేటగిరీ లబ్ధిదారులు 50% బ్యాంకు రుణం, 40% సబ్సిడీ, 10% లబ్ధిదారుడు వాటాగా చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు 30% బ్యాంకు రుణం, 60 శాతం సబ్సిడీ, 10% లబ్ధిదారులు వాటాగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈరోజు నిర్వహించిన సమావేశంలో 12 పథకాలకు సంబంధించి అందిన 110 దరఖాస్తులలో, పది పథకాలకు సంబంధించి 100 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. వీటిలో సీవీడ్ కల్చర్ సాగుకు యూనిట్ ధర రూ.15 వేలు కాగా ఒక వెయ్యి యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, 42 మంది దరఖాస్తు చేసుకోగా మంజూరు చేయడం జరిగిందన్నారు. ఐస్ బాక్స్‌తో మోటార్ సైకిళు ్ళ యూనిట్ ధర రూ.75 వేలు కాగా 6 యూనిట్లు అందుబాటులో ఉండగా 17 దరఖాస్తులు అందాయని అర్హత కలిగిన 6 మందికి మంజూరు చేయడం జరిగింది అన్నారు. చేపల అమ్మకం కోసం ఇ-రిక్షాలు సహా ఐస్ బాక్స్‌తో కూడిన మూడు చక్రాల వాహనం యూనిట్ ధర రూ.3 లక్షలు కాగా 16 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని అందిన ఐదు దరఖాస్తులను మంజూరు చేయడం జరిగిందన్నారు. సాంప్రదాయ మత్స్యకారులకు పడవలు, వలలు యూనిట్ ధర రూ.5 లక్షలు కాగా 80 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తు చేస్తున్న 13 మందికి మంజూరు చేయడం జరిగింది అన్నారు. చేపల కియోస్కులు నిర్మాణాల యూనిట్ ధర రూ.10 లక్షలు కాగా 23 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని వీటి ఏర్పాటుకు అందిన ఏడు దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. ఇన్సులేటెడ్ వాహనాలు యూనిట్ ధర రూ.20 లక్షలు కాగా 4 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని వచ్చిన దరఖాస్తులలో నాలుగు దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్స్ - స్టేషనరీ/కంటైనర్ / మొబైల్ యూనిట్ ధర రూ.20 లక్షలు కాగా ఐదు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, అందిన ఏడు దరఖాస్తుల్లో ఐదింటిని ఆమోదించడం జరిగిందన్నారు. ఫిష్ వాల్యూ యాడ్ ఎంటర్‌ప్రైజెస్ యూనిట్ ధర రూ.50 లక్షలు కాగా నాలుగు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని, అందిన ఒక్క దరఖాస్తును ఆమోదించడం జరిగిందన్నారు. లార్జ్ ఆర్ ఏ ఎస్ - రీ-సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్ స్థాపన యూనిట్ ధర రూ.50 లక్షలు కాగా, మూడు యూనిట్లు అందుబాటులో ఉన్నాయని అందిన ఒక్క దరఖాస్తును ఆమోదించడం జరిగిందన్నారు. ఫిష్ రిటైల్ హబ్ నిర్మాణం యూనిట్ ధర ఒక కోటి రూపాయలు కాగా అందుబాటులో నాలుగు యూనిట్లు ఉన్నాయని యూనిట్ స్థాపనకు అందిన ఒక దరఖాస్తును ఆమోదించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ మరియు అప్సడ జిల్లా నోడల్ అధికారి పి.సురేష్, జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఏ.నాగరాజు, డిఆర్డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఫిషరీష్ ఏడీలు, ఎఫ్డివోలు, ఆక్వా రైతుల ప్రతినిధి వాతాడి కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.



# కోకో నాణ్యతపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కోకో నాణ్యత పెంచేందుకు 12 కోట్లతో రైతులకు ఆధునిక పరికరాలు కోసం ప్రతిపాదనలు సమర్పించాం.
- అవగాహన సదస్సులు నిర్వహించి రైతులు నుండి సలహాలు, సూచనలు తీసుకోవాలి.
- దేశంలోనే ఏలూరు జిల్లా కోకో మొదటి స్థానంలో ఉన్నాం, అదే స్థాయి క్వాలిటీలో ఉండేలా చూడాలి.
- జిల్లాలో 36,150 ఏకరాలు కోకో సాగు జరుగుతుంది, ఈ ఏడు అదనంగా మరో 3 వేలు ఏకరాలు పెంచాలి.
- కొబ్బరి లోనే కాదు, ఆయిల్ పామ్, కోకో పంటలు సాగుతో రైతులు అధిక లాభాలు పొందాలి.
- కోకో సాగు, మార్కెటింగులో రైతులకు అన్ని విధాల సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది.
- జిల్లాలో కోకో ప్రాసెసింగు యూనిట్లు స్థాపనకు రైతులు ముందుకు వస్తే అన్ని సౌకర్యాలు కల్పిస్తాము.
- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...



ఏలూరు, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో బుధవారం " కోకో సాగు మరియు పంటకోత తర్వాత నిర్వహణలో ఆధునిక పద్ధతులపై ఒక రోజు వర్క్‌షాప్ లో " జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నాణ్యమైన కోకో మంచి ధర పలుకుతుందని, దేశంలోనే ఏలూరు జిల్లా కోకో సాగులో మొదటి స్థానంలో ఉందని, , అదే స్ఫూర్తితో నాణ్యమైన కోకో సాగు చేసేలా రైతులు దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో 18 మండలాలు 13 వేల మంది రైతులు 36,150 ఏకరాలు కోకో సాగు జరుగుతుందని, ఈ ఏడు అదనంగా మరో 3 వేలు ఏకరాలు పెంచుటకు అధికారులు ప్రత్యేక దృష్టి, రైతులు ముందుకు రావాలన్నారు. జిల్లాలో ఎక్కువగా టి.నరసాపురం, పెదవేగి, జంగారెడ్డిగూడెం, చింతలపూడి కామవరపుకోట, ద్వారకాతిరుమల ఆరు మండలాల్లో కోకో పంట ఎక్కువగా సాగు చెయ్యడం శుభ పరిణామం, అదే స్థాయిలో మిగతా మండలాలు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. కొబ్బరి లోనే కాదు, ఆయిల్ పామ్, కోకో పంటలు సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. కోకో సాగు, మార్కెటింగులో ఉన్న ఇబ్బందులను తొలగించి, రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, రైతులు కోకో పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రైతులు క్వాలిటీ కోకో పంటలు వేస్తే కొనుగోలుదారులే మన ఇంటికి వచ్చి మంచి ధరను ఇచ్చి కొనుక్కుంటారన్నారు. పండిన పంటలు పులియ పెట్టడం, ఎండబెట్టడం, కోకో నాణ్యత పెంచడానికి ఆధునిక పరికరాలు కోసం రూ 12 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని తెలిపారు. రైతులకు ఇంకేమైనా కావాలన్నా, వీటిపై అవగాహన సదస్సు నిర్వహించి, రైతులు నుండి సలహాలు,సూచనలు తీసుకోవాలన్నారు.జిల్లా జిడిపిని పెంచేలా, కోకో ప్రాసెసింగు యూనిట్లు స్థాపనకు రైతులు ముందుకు వస్తే సకల సౌకర్యాలు కల్పిస్తాము: జిల్లా కలెక్టరు వ్యవసాయ, అనుబంధ రంగాలలో పాటు కోకో ప్రాసెసింగు యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఏలూరు జిల్లా జీడిపిని పెంచేందుకు రైతులు ముందుకు అడుగులు వెయ్యాలని, జిల్లాలో ఏన్ని కావాలంటే అన్ని ప్రాసెసింగు యూనిట్లు స్థాపనకు అని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పూర్తి స్థాయిలో ఋణాలు మంజూరు చేస్తామని, మనతో పాటు మరికొందరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించ వచ్చునని అన్నారు. ఔత్సాహికులు, ఆసక్తి కల రైతులు ముందుకు వచ్చి ధరఖాస్తులు ఇస్తే స్థాపనకు అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. కోకో రైతులు మాట్లాడుతూ ఇటువంటి వర్క్ షాపులు, సెమినార్లు నిర్వహించడం మాకు చాలా ఉపయోగాలు ఉంటాయని క్రమం తప్పకుండా సమావేశాలు జరపాలని తెలిపారు. మాటలు చెప్పినట్లు, కాగితాలు మీద చూపించి నట్లుగా క్షేత్రస్థాయిలో మాకు మేలు చెయ్యగలిగితే కోకో పంటలు మీద మరింత ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. కోకో నాణ్యత గల విత్తనాలు, సాగు, మార్కెటింగు పలు సందేహాలను రైతులు అడగగా, అధికారులు, శాస్త్రవేత్తలు నివృత్తి చేయడంతో రైతులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపి యఫ్ పియస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు డా.జి.శేఖర్ బాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. షాజా నాయక్, ఏపి యంఐపి పిడి డా.యస్. రామ్మోహన్, డిఆర్డిఏ పిడి ఆర్.విజయ రాజు, యల్ డియం డి.నీలాద్రి, ఏపి ఫుడ్ ప్రాసెసింగు సొసైటీ పియంయఫ్ యంఇ జోనల్ మేనేజరు కె.జె మారుతి, ఏలూరు జోనల్ మేనేజరు సాయి శ్రీనివాసు, డిఆర్ పిపి హిమవాణి, శాస్త్రవేత్తలు డా.పి.మాధవీలత, డా.కె. రామచంద్రుడు, మండల ఉద్యాన శాఖ అధికారులు, కోకోశాల ఫౌండరు చాక్ లేటు స్పెషలిస్టు నితిన్ కార్డియా, మొండలీజ్ కోకో కంపెనీ ప్రతినిధులు, కోకో రైతులు, జిల్లా ఉద్యాన శాఖ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడం సనాతన ధర్మమా...?

**- సుప్రీంకోర్టు సిజెఐ గవాయి పై దాడి చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలి**
**- దళిత ప్రజా సంఘాల డిమాండ్**





అమలాపురం, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన భారతదేశ అత్యున్నత నాయ స్థానం ప్రధాన న్యాయమూర్తి బాలకృష్ణ గవాయి పై హిందూ మతోన్మాది రాకేష్ కిషోర్ చేసిన దాడి హేయమైన చర్య అని దేశ ప్రజలందరూ సిగ్గుపడేలా జరిగిన దాడిని నిరసిస్తూ దళిత. ప్రజా. విద్యార్థి. మహిళ. కార్మిక. ఉపాధ్యాయ. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశాన్ని చూసి సిగ్గుపడేలా ప్రపంచ దేశాలన్నీ నివ్వెర పోయేలా మనువాద సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారనే అక్కసుతో మనదేశ ప్రధాన న్యాయమూర్తి పై హిందూ మత ఉన్మాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం యావత్ దేశమంతా తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత ఘోరమైన దాడి జరిగిన గాని దేశ రాష్ట్రపతి ప్రధాని చట్టాన్ని రక్షించే హోంమంత్రి ఖండించకపోవడం సిగ్గుచేటని అన్నారు ఒక దళితుడు ప్రధాన న్యాయమూర్తి ఇంతటి దారుణానికి ఒడి కడతారా ఇంత అవమానానికి గురి చేస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు దేశ ప్రధాన న్యాయమూర్తి కొనసాన్నల్లోనే ప్రమాణ స్వీకారం చేసే ప్రజా ప్రతినిధులు ఆ న్యాయమూర్తి పై దాడి జరిగితే మౌనంగా ఉండటం వివక్ష చూపడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు మోదీ మత ఉన్మాద ప్రభుత్వ మద్దతుతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా దేశ ప్రధానమంత్రి రాష్ట్రపతి ముఖ్యమంత్రి స్పందించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని ఖండించాలని దాడి చేసిన మతోన్మాదిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజాసంఘాల నాయకులు సిపిఎం జిల్లా కన్వీనర్ కారం వెంకటేశ్వరరావు పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్ ఉపాధ్యక్షులు ఆకుమర్తి రవి పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిల్లెల్ల మనోహరం అమలదాసు బాబురావు రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కొండా దుర్గారావు మాజీ ఏపీపీ ఐ ఎన్ మల్లేశ్వరరావు పెనుమాల చిట్టిబాబు సాపే బాల రవి గిడ్ల వెంకటేశ్వరరావు దళిత సేన జాతీయ ఉపాధ్యక్షులు దుక్కుపాటి సత్యనారాయణ జీవీ రమణ పెంకే వెంకటేశ్వరరావు పీతల రామచంద్రరావు జి దైవ కృప శెట్టి బత్తుల తులసిరావు బత్తుల జాగృతి కుమార్ పి దుర్గాప్రసాద్ పి అమూల్య డేవిడ్ అంబేద్కర్ సాపే రమేష్ జి మురళి బత్తుల సాత్విక్ బత్తుల నకుల్ రాజు గద్దం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు

## నూతనంగా ఏర్పాటైన ఆత్మ కమిటీ చైర్మెన్,సభ్యులకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యనందరావు....



కొత్తపేట, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కొత్తపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్, సభ్యులుగా నియమితులైన వారందరికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందనలు తెలియజేశారు. కొత్తపేట నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ గా రావులపాలెం మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కంపూడి సీతారామకృష్ణ బాలాజీ, ఆత్మ కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా అంకంపాలెం మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కుడప కృష్ణమూర్తి నియమితులయ్యారు. సభ్యులుగా పొడగట్లపల్లికి చెందిన జనిపిరెడ్డి తాతారావు, రావులపాడుకు చెందిన బొక్కా శ్రీనివాసరావు రావులపాలెంకి చెందిన పసుపులేటి రాధాకృష్ణ, ఈతకోటకు చెందిన మట్టా వెంకటరమణ, వెదిరేశ్వరంకు చెందిన నామాల దుర్గా,లక్ష్మీపోలవరానికి చెందిన చల్లాబత్తుల సత్యవతి, దేవరపల్లి కి చెందిన కట్టా శ్రీనివాసరావు, పొడగట్లపల్లికి చెందిన సకినాల నాగజ్యోతి, అవిడికి చెందిన సూర్యవరపు వీర వెంకటేశ్వరరావు, వాడపాలెంకు చెందిన గని శెట్టి పుల్లయ్య, వానపల్లికి చెందిన దునబోయిన పల్లంరాజు గంటికి చెందిన కొల్లపు సుధీర్, పలివెలకు చెందిన తోట కళ్యాణ చక్రవర్తి, కొత్తపేటకు చెందిన బూసి మరియమ్మ,మోడేకుర్రుకు చెందిన గొలకోటి ఈశ్వరరావు, బిల్లకుర్రుకు చెందిన యెలిశెట్టి శివప్రసాద్, వానపల్లికి చెందిన బల్ల సుధారాణి వెలిచేరుకు చెందిన అంగర శ్రీను, పులిదిండికి చెందిన కుడిపూడి సుబ్బారావు, వాడపల్లికి చెందిన ఏపుగంటి వెంకటేశ్వరరావు, అంకంపాలెంకు చెందిన కరుటూరి శ్యామలాదేవి, పేరవరానికి చెందిన చిటికెన భవాని, పేరవరానికి చెందిన తలారి రమేష్,వద్దిపర్రుకు చెందిన జుజ్జువరపు బుచ్చి వెంకటరాయుడు, ర్యాలికి చెందిన బందెల ప్రసాద్, లొల్ల కు చెందిన కల్లూరి భాస్కరరావు, ఉచ్చిలికి చెందిన మట్టాలక్ష్మి నియమితులయ్యారు. ఎమ్మెల్యే బండారు వీరందరికీ అభినందనలు తెలియజేశారు.తమకు ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వచ్ఛ పురస్కార గ్రహీతలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలి

**వచ్చే ఏడాది మరిన్ని పురస్కారాలు అందుకోవాలి....**
**స్వచ్ఛ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలి.....**
**కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....**



కొత్తపేట, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రతీ ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, మంచి ఆహారం ఎంత అవసరమో, మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం కూడా అంతే ముఖ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని, స్వచ్ఛాంధ్ర ద్వారానే స్వర్ణాంధ్ర సాకారం అవుతుందని మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాల గ్రహీతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్న లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, కె.ఎస్ కృష్ణమాచార్యులు,రావులపాలెం డిపో మేనేజర్ వై వి వి ఎమ్ కుమార్ ను జిల్లా స్థాయిలో పురస్కారాలు అందుకున్న కొత్తపేట ఎంపీడీవో నరేష్ కుమార్,కొత్తపేట సీహెచ్సీ డా. జి దుర్గాప్రసాద్,గోపాలపురం గవర్నమెంట్ హెూమియో డిస్పెన్సరీ డా.అలుగుల రవి రాజశేఖర్, అవంతి ఫ్రోజన్ ఫుడ్స్ తరపున చిదంబరం, ఈతకోట ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ నుంచి భారతీకుమార్, మడికి ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ సుహాసినీరాణి,ఆలమూరు జీహెచ్ఎస్ బి.అప్పాజీ,జొన్నాడ అంగన్వాడీ కార్యకర్త గెద్దాడ ఆదిలక్ష్మి, ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు 596 మార్కులు సాధించిన కలవచర్లకు చెందిన విద్యార్థి పి మోహనకృష్ణ, విద్యార్థి సోదరి 590 మార్కులు సాధించిన కావ్యశ్రీ దుర్గలను ఘనంగా సత్కరించారు. స్వచ్ఛ పురస్కారాలను అందుకున్నవారిని మిగిలినవారు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది నియోజకవర్గం నుంచి మరిన్ని పురస్కారాలు సాధించాలని అన్నారు.స్వచ్ఛ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రతి గ్రామపంచాయతీ మొదలుకొని ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్ ),గుత్తుల రాంబాబు,కేతా శ్రీను,ఈదాల సత్యనారాయణ మూర్తి,కొప్పిశెట్టి ప్రసాద్,గనిశెట్టి వీరేష్, కుసంపూడి రామకృష్ణంరాజు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలోని అన్ని ప్రాంతాలలో యుద్ధప్రాతిపదికన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

**ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి ట్యాంకులు పరిశుభ్రం, వైద్య పరీక్షలు**
**తాగునీరు కలుషితం కాకుండా చర్యలు**
**పాఠశాలలు, వసతిగృహాలలో ఫీవర్ సర్వే లు, వైద్య పరీక్షలు**
**అధికారులతో కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**

ఏలూరు, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జిల్లాలో ఎక్కడా అంటువ్యాధులు వ్యాపించకుండా అన్ని ప్రాంతాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా పాఠశాలలు, వసతి గృహాలలో గురువారం నాటికి పారిశుద్ధ్య కార్యక్రమాలు, త్రాగునీటి నీటి ట్యాంకులు శుభ్రపరిచే పనులను పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. . స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం పారిశుద్ధ్యం, త్రాగునీటి వనరుల పరిశుభ్రత, విద్యార్థులకు ఫీవర్ సర్వే, వైద్య పరీక్షలు, జీఎస్టీ అవగాహన, సదరం క్యాంపుల నిర్వహణ, తదితర అంశాలపై కలెక్టర్ ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబల కుండా జిల్లావ్యాప్తంగా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి గురువారం నాటికి పూర్తిచేయాలన్నారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు ,వెనుకబడిన తరగతులకు చెందిన ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, తదితర ప్రదేశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ఫీవర్ సర్వే, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఎవరైనా అతిసారం, కామెర్లు వంటి వాటితో బాధపడుతుంటే వెంటనే చికిత్సలు అందించాలన్నారు. కలుషిత త్రాగునీరు ద్వారా అతిసారం, కామెర్లు వంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని, కావున త్రాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలనీ, క్లోరినేషన్ చేయించాలని, త్రాగునీటి పైప్ లైన్లకు ఎక్కడైనా డ్రైనేజి పైప్ లైన్లు కలిసి త్రాగునీరు కలుషితం అవుతున్నాయేమోనని పరిశీలించి, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఫీవర్ సర్వే, వైద్య శిబిరాలు ఏర్పాటు, సదరం శిబిరాలు ఏర్పాట్లను మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లు తనిఖీ చేయాలన్నారు. జీఎస్టీ 2. %ఉ% లో దీర్ఘకాలిక రోగులకు సంబందించిన ఔషదాలు, కొన్ని ఔషదాలపై పూర్తిగా జీఎస్టీ తొలగించిన విషయంపై అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సదరం క్యాంపుల సక్రమంగా నిర్వహించాలని, సదరం ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే విభిన్న ప్రతిభావంతులకు వీల్ ఛైర్లు, త్రాగునీరు, కుర్చీలు, షామియానా వంటి ఏర్పాటు చేయాలనీ, ఎక్కడా ఎటువంటి రద్దీ వంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి కె. అనురాధ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి .జె. అమృతం, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ. భానుప్రతాప్, సాంఘిక సంక్షేమ శాఖ జెడి విశ్వమోహన్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఆర్.వి. నాగరాణి, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ప్రభృతులు పాల్గొన్నారు.

## బాణాసంచా ప్రమాదాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

**రెవిన్యూ, పోలీసు, ఫైర్, తదితర శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటుచేసి**
**బాణాసంచా అనధికార, తయారీ,నిల్వ, అమ్మకం, భద్రతా చర్యలపై ప్రత్యేక నిఘా పెట్టాలి**
**జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తో కలిసి అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలీకాన్ఫెరెన్స్**

ఏలూరు, అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



జిల్లాలో ఎటువంటి బాణాసంచా ప్రమాదాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాలో బాణాసంచా ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు, బాణాసంచా అనధికార తయారీ, నిల్వలు, అమ్మకాల నియంత్రణపై బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె. ప్రతాప్ శివ కిషోర్ లతో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా బాణాసంచా ప్రమాదాలు జరగకుండా రెవిన్యూ, పోలీసు, ఫైర్, తదితర శాఖల అధికారులతో తనిఖీ బృందాలను ఏర్పాటుచేసి, జిల్లాలో లైసెన్స్ కలిగిన బాణాసంచా తయారీ, నిల్వ, అమ్మకాల షాపులను తనిఖీ చేసి, అక్కడ భద్రతా ఏర్పాట్లు, పరిసరాలలో నివాసిత గృహాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. అనధికార బాణాసంచా తయారీ, నిల్వలు, అమ్మకాలపై నిఘా పెట్టి వాటిని నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉండే అగ్ని, షార్ట్ సర్క్యూట్ వంటివి జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను దుకాణాదారులకు తెలియజేసి, వాటిని వారు ఏర్పాటుచేసుకునేలా చూడాలన్నారు. బాణాసంచా అమ్మే షాపులకు తాత్కాలిక లైసెన్స్ లు జారీ సమయంలో ఆయా షాపుల షాపు యజమునులు షాపుల వద్ద ప్రమాద నివారణకు ఖచ్చితంగా చర్యలు తీసుకునేలా చూడాలని, సదరు షాపుల వద్ద ప్రమాదాల నివారణకు ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలందరూ దీపావళి పండుగ జరుపుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల నుండి ఏలూరు జిల్లాకు రవాణా అయ్యే బాణాసంచా పై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ప్రజా రవాణా వాహనాలలో బాణాసంచా తరలించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ., ప్రైవేట్ రవాణా వాహనాలను చెక్ పోస్ట్ ల వద్ద తనిఖీలు నిర్వహించాలని, అనధికారికంగా బాణాసంచా రవాణా చేసేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె. ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ గతంలో ఊరు శివారు ప్రాంతంలో బాణాసంచా తయారీకి అనుమతులు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో నివాసిత గృహాలు వచ్చివుంటాయని , అటువంటి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాలను ఆ నివాసిత ప్రాంతాల నుండి తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాణాసంచా తయారీ, నిల్వ, అమ్మకం ప్రదేశాలలో ఆకస్మిక ప్రమాదాల సమయంలో భద్రతకు నీరు, ఇసుక వంటివి అందుబాటులో ఉండేలా వారికి తెలియజేయాలన్నారు. బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలు ఒకేచోట ఉన్న సమయంలో వాటిని దూరంగా ఉంచేలా యజమానులకు తెలియజేయాలన్నారు. డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, డిఎంహెచ్ఓ డా. పి .జె. అమృతం, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లఘు చిత్రాల పోటీకి గడువు పెంపు

భీమవరం అక్టోబర్, 8 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



"ఆంధ్ర యువ సంకల్ప్ 2K25- అంబాసిడర్" డిజిటల్ మారథాన్ కార్యక్రమంలో "యువ సంకల్ప్" లఘు చిత్రాల పోటీకి గడువు పెంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు "ఆంధ్ర యువ సంకల్ప్ 2K25- అంబాసిడర్" డిజిటల్ మారథాన్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువతను భాగస్వామ్యము చేస్తూ వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా సామాజిక బాధ్యత, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యకరమైన జీవనం, డిజిటల్ ఆవిష్కరణలు, కృత్రిమ మేధా విజ్ఞానాన్ని ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల ఈవెంట్స్ ను థీమ్ తీసుకొని విద్యార్థులు, యువత 120 సెకండ్లు (రెండు నిమిషాలు) నిడివి కలిగిన వీడియో/పార్ట్ లను వారి సొంత సోషల్ మీడియాలో హేష్ ట్యాగులతో పోస్ట్ చేయాలని సూచించారు. తొలుత www.andhrayuvasankalp.com వెబ్ సైట్ లో రిజిస్టర్ కావాలన్నారు. "యువ సంకల్ప్" లఘు చిత్రాల పోటీలలో గెలుపొందిన తొమ్మిది మంది విజేతలను ఎంపిక చేసి ఆంధ్ర యువ సంకల్ప్ 2k25 అంబాసిడర్ గా సత్కరించడంతోపాటు మొదటి బహుమతిగా ఒక లక్ష, ద్వితీయ బహుమతిగా 75 వేల రూపాయలు, తృతీయ బహుమతిగా 50వేల రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. గతంలో చివర తేదీగా ప్రకటించిన సెప్టెంబర్ 30వ తేదీ గడువును అక్టోబర్ 15 వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా జిల్లాలోని యువతను, అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ కు సూచించడం జరిగింది. ఏదైనా సందేహాలు ఉంటే సెట్వెల్ కార్యాలయం సూపరింటెండెంట్ జాన్ కెనడి సెల్ నెంబర్ ..7075230609 నందు సంప్రదించాలి.

# ఆస్ట్రేలియా క్రికెట్‌ను వదిలేస్తే చెరో రూ.58 కోట్లు..

## ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆఫర్

సోషల్ మీడియాతోపాటు క్రికెట్ వర్గాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఆస్ట్రేలియా కెప్టెన్‌తోపాటు ఆ జట్టు డేంజరస్ బ్యాటర్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ మొత్తం ఆఫర్ చేసిందని.. అందుకోసం ఓ షరతు విధించినట్లు కథనాలు వస్తున్నాయి. ఇంతకీ ఆ ఆటగాళ్లు ఎవరు? ఆఫర్ ఏంటో ఓ లుక్కేద్దాం...

ఆస్ట్రేలియా టెస్టు జట్టు సారథి పాట్ కమిన్స్, ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ఐపీఎల్‌కు చెందిన ఓ ఫ్రాంచైజీ రూ. 58 కోట్లు (10 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్లు) చొప్పున ఇచ్చేందుకు ఆఫర్ చేసింది. అయితే, ఆ మొత్తం అందుకోవాలంటే ముందు ఆస్ట్రేలియా క్రికెట్ నుంచి బయటకు రావాల్సి ఉంటుంది. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కాకుండా.. తమ ఫ్రాంచైజీకి చెందిన జట్ల తరఫున ఇతర టీ20 లీగుల్లోనూ ఆడాల్సిఉంది. జాతీయ జట్టు తరఫున ఆడకుండా.. ఫ్రాంచైజీకి వస్తున్నందుకే ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏడాది పొడవునా లీగులు ఉండటంతో ఫ్రాంచైజీకీ ఆ ధర బాగానే వర్కౌట్ అవుతుందనేది క్రికెట్ వర్గాల అంచనా. అయితే, వారిద్దరూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా, రాష్ట్రాల క్రికెట్ సంఘాలు, ప్లేయర్ల యూనియన్‌లోనూ చర్చించాల్సి ఉంది.




రెండేళ్లు ఏంటి.. మరో నాలుగేళ్లు ఆడేంత 'నాజూగ్గా'!

### ఇప్పటివరకు ఎంత వస్తుందంటే?

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న పాట్ కమిన్స్ (%ఞ జబఎఎఅఅం%)ను ఏడాదికి రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. ప్రస్తుతం అతడే ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ అనే సంగతి తెలిసిందే. ఇక క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఏడాదికి కాంట్రాక్ట్ రూపంలో రూ. 8.74 కోట్లు వస్తాయి. ప్రస్తుతం అతడు టెస్టు, వన్డేలకు సారథిగా ఉన్నాడు. తమ జాతీయ బోర్డు నుంచి అన్నీ కలుపుకొని రూ. 17.50 కోట్ల వరకూ వస్తాయి. ఇతర ఫ్రాంచైజీల్లోనూ ఆడినప్పటికీ ఇంత మొత్తం రాదు. ఐపీఎల్‌తో వచ్చే ఆదాయం కలిపి సుమారు రూ. 35 నుంచి 40 కోట్ల వరకూ అందుతాయి.

ట్రావిస్ హెడ్ విషయంలో ఈ మొత్తం కాస్త తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఎస్ఆర్‌హెచ్ అతడిని రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి రూ. 8.70 కోట్లు వస్తాయి. ఇతర లీగుల్లోనూ ఆడినప్పటికీ ఈ మాత్రం మొత్తం రాదు. ఏడాదికి ట్రావిస్ హెడ్ సుమారుగా రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకూ తీసుకుంటాడు. ఇప్పుడు ఆ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఇస్తామన్న రూ.58 కోట్ల ఆఫర్ కమిన్స్‌తో పోలిస్తే హెడ్‌కే ఎక్కువ బెనిఫిట్ అవుతుంది.

# సత్తా చాటిన తెలుగు టైటాన్స్

### హర్యానాపై ఘన విజయం -3వ స్థానానికి చేరిక




చెన్నై: ప్రొ కబడ్డీ సీజన్-12లో తెలుగు టైటాన్స్ జట్టు హవా కొనసాగుతోంది. ఎడిఎటి మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 46-29పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను చిత్తుచేసింది. ఆల్‌రౌండర్ భరత్ ఏకంగా 20 పాయింట్లతో సత్తా చాటగా.. కెప్టెన్ విజరు మాలిక్(9) రైడ్ పాయింట్లతో రాణించాడు. ట్యాకిల్స్‌లో శుభమ్, అంకిత్ చెలరేగారు. మరోవైపు హర్యానా జట్టులో రైడర్ మయాంక్ సైనీ(5)కి తోడు కెప్టెన్ జైదీప్(4) మాత్రమే రాణించారు. ఈ గెలుపుతో తెలుగు టైటాన్స్ 13మ్యాచ్‌లు ముగిసేసరికి 8విజయాలతో సహా 16పాయింట్లతో 3వ స్థానానికి ఎగబాకింది.

**ప్రొ కబడ్డీలో నేడు..**
**బెంగాల్ వారియర్స్ ఐ దబాంగ్ ఢిల్లీ(రాత్రి 8.00గంఎఎలకు)**
**గుజరాత్ జెయింట్స్ ఐ యుపి యోధాస్(రాత్రి 9.00గంఎఎలకు)**

# సెంచరీతో ఆదుకున్న మూనీ




### పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా మహిళల ఘన విజయం

కొలంబో: పాకిస్తాన్ మహిళలతో జరిగే లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళలు ఘన విజయం సాధించారు. ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 115పరుగులకే 8వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో బెత్ మూనీ(109) అద్భుత శతకంతో చెలరేగింది. ఓవైపు వికెట్లు పడుతున్నా.. మొక్కవోని దీక్షతో సెంచరీ మార్కును దాటి.. జట్టుకు మెరుగైన స్కోరు అందించింది. మరోవైపు కింగ్(51నాటౌట్) అర్ధసెంచరీతో రాణించింది. దీంతో వీరిద్దరూ 9వ వికెట్‌కు ఏకంగా 106పరుగులు జోడించారు. దీంతో ఆసీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 221 పరుగుల స్కోర్ చేసింది. ఛేదనలో పాకిస్తాన్ జట్టు 49పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి ఓటమి కోరల్లో నిలిచింది. కడపటి వార్తలందే సమయానికి పాక్ జట్టు 35ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 115పరుగులు చేసింది. ఆర్.ప్రేమదాస స్టేడియంలో టాస్ గెలిచిన పాకిస్తాన్ మహిళా జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ ఫాతిమా సనాతో పాటు సైదా ఇక్బాల్ ఆది నుంచే చెలరేగి ఆసీస్ ఓపెనింగ్ జంటను విడదీశారు. ఈ క్రమంలో ఓపెనర్లలో ఫొబె లిచ్‌ఫీల్డ్ 10, కెప్టెన్ అలిసా హేలీ 20 పరుగులకే పరిమితం కాగా.. వన్‌డౌన్లో వచ్చిన ఎలిస్ పెర్రీ (5) దారుణంగా విఫలమైంది. నష్రా సంధు బౌలింగ్‌లో స్టంపౌట్‌గా వెనుదిరిగింది. పాక్ బౌలర్ల ధాటికి ఐదో స్థానంలో వచ్చిన అనాబెల్ సదర్లాండ్ (1), ఆష్లే గార్డ్‌నర్ (1), తాహిలా మెగ్రాత్ (5) ఇలా వచ్చి అలా వెళ్లగా.. జార్జియా వారేహమ్ (0), కిమ్ గార్త్ (11) కూడా చేతులెత్తేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నాలుగో నంబర్ బ్యాటర్ బెత్ మూనీ.. ఆల్‌రౌండర్ అలనా కింగ్‌తో కలిసి అద్భుత పోరాటం చేసింది.

**శతకంతో ఆదుకున్న మూనీ**

ఆసీస్ 76 పరుగులకే ఏకంగా ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుపోయిన వేళ.. బెత్ మూనీ సంచలన ఇన్నింగ్స్‌తో మెరిసింది. సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ 114 బంతుల్లో 11 ఫోర్ల సాయంతో 109 పరుగులు సాధించింది. అయితే, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి ఫాతిమా సనా బౌలింగ్‌లో సదాఫ్ షమాస్‌కు క్యాచ్ ఇవ్వడంతో మూనీ అవుటైపోయింది. మరో ఎండ్‌లో అలనా కింగ్ 49 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్ల సాయంతో 51 పరుగులతో అజేయంగా నిలిచింది. వీరిద్దరు కలిసి తొమ్మిదో వికెట్‌కు ఏకంగా 106 పరుగులు జోడించి జట్టును గట్టెక్కించారు. మూనీ, అలనా అద్భుత ప్రదర్శన కారణంగా ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 221 పరుగుల మెరుగైన స్కోరు సాధించింది.

# విశాఖలో పరుగుల వరదే..

**నేడు దక్షిణాఫ్రికాతో తలపడనున్న హర్మన్‌ప్రీత్ సేన**
**పొంచివున్న వర్షం ముప్పు**
**ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్**

విశాఖపట్నం: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా మరో పోరుకు సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో పాయింట్ల పట్టికలో 2వ స్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన.. గురువారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో పటిష్ట దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌కు సిద్ధమైంది. శ్రీలంక, పాకిస్తాన్‌పై సునాయాస విజయాలను నమోదు చేసుకున్న భారత మహిళలజట్టుకు అసలు సిసలు పరీక్ష నేడు ఎదురుకానుంది. మరోవైపు దక్షిణాఫ్రికా జట్టు తొలి మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో చిత్తుగా ఓడినా.. రెండో మ్యాచ్‌లో ఏకంగా న్యూజిలాండ్ మహిళలకు ఝలక్ ఇచ్చిన ఉత్సాహంతో భారత్‌తో మ్యాచ్‌కు సిద్ధమైంది. విశాఖలోని ఎసిఎ-విడిసిఎ స్టేడియంలో తొలిసారి జరిగే ఈ మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరుకానున్నట్లు సమాచారం. టీమిండియా ఓపెనర్లు దుర్భేధ్యఫామ్‌కి తోడు బౌలింగ్ విభాగంలో క్రాంతి గాడ్, శ్రీచరణి, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఫామ్‌లో ఉండడం శుభపరిణామం. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన రాణిస్తే భారీస్కోర్ నమోదు కావడం ఖాయం. వికెట్ కీపర్ రీచా ఘోష్ క్యాచ్‌లు అందుకోవడంలో కొంత అలసత్వం ప్రదర్శిస్తున్నా.. బ్యాటింగ్‌లో రాణిస్తుండడం శుభ పరిణామం. పాకిస్తాన్‌పై 20బంతుల్లో 35పరుగులు కొట్టి భారతజట్టు గౌరవప్రద స్కోర్‌కు దోహదపడింది. ఈ టోర్నీ ప్రారంభానికి ముందు భారత మహిళలజట్టు ఇక్కడే ప్రాక్టీస్ అయిన దృష్ట్యా పిచ్ స్వభావంపై ఆటగాళ్లకు ఒక అవగాహన ఉండగా.. ఈ మ్యాచ్ తర్వాత భారత మహిళలజట్టు పటిష్ట ఆస్ట్రేలియాతో తలపడాల్సి ఉన్న




క్రమంలో గెలుపే లక్ష్యంగా సఫారీలతో మ్యాచ్‌కు సిద్ధమైంది. జ్వరం కారణంగా పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు దూరమైన రేణుకా సింగ్, అమన్‌జ్యోత్ కౌర్ కోలుకోవడం భారతజట్టుకు ఊరటనిచ్చే అంశం. ఈ మైదానంలో పరుగుల వరద పారడం ఖాయమని క్యూరేటర్ ఇప్పటికే ప్రకటించగా.. వర్షం ముప్పు పొంచివున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది.

**పొంచివున్న వర్షం ముప్పు?**

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి వున్నట్లు ఇక్కడి వాతావరణ శాఖ బుధవారం ప్రకటించింది. మ్యాచ్ జరిగే రోజు ఉదయం 9గం.ల నుంచి 12 గం.ల వరకు తేలికపాటి వర్షం కురిసే అవకాశమున్నట్లు.. బుధవారం కూడా వర్షం కురిసిన నేపథ్యంలో నేడు జరిగే మ్యాచ్‌కూ వర్షం అడ్డంకి నిలిచే అవకాశమున్నట్లు తాజా ప్రకటనలో పేర్కొంది. మ్యాచ్ జరిగే సమయంలో మేఘాలు 78% మైదానాన్ని కమ్మివేయనున్నట్లు దీంతో మ్యాచ్ సజావుగా సాగడం కష్టమేనని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో టాస్ గెలిచిన జట్టు తొలుత బ్యాటింగ్‌కు మొగ్గుచూపే అవకాశముంది.

**జట్లు(అంచనా)శా**

%భారత మహిళలజట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), ప్రతిక రావల్, మంధాన(వైస్ కెప్టెన్), హర్లిన్ డియోల్, రోడ్రిగ్స్, దీప్తి శర్మ, స్నే%ఎ% రాణా, రీచా ఘోష్(వికెట్ కీపర్), శ్రీచరణి, క్రాంతి గాడ్, రేణుకా సింగ్/అమనజ్యోత్. దక్షిణాఫ్రికా మహిళలజట్టు: వోల్వాడాట్(కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, సూనే లూస్, మారిజానే కాప్, బోట్చ్, జోఫ్తా(వికెట్ కీపర్), ట్రయాన్, డి-క్లార్క్, క్లాస్, ఖాకా, మాబా.

# విశాఖలో భారత్ - ఆసీస్ వన్డే..

# టికెట్ ధర రూ.150



మహిళల క్రికెట్ ప్రపంచకప్ పోటీలతో నగరంలో కోలాహలం నెలకొంది. ఈ నెల 9 నుంచి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మొత్తం అయిదు మ్యాచ్‌లు జరగనున్నాయి. 9న భారత్-దక్షిణాఫ్రికా, 12న భారత్- ఆస్ట్రేలియా మ్యాచ్‌లు జరగనున్నాయి. 13న దక్షిణాఫ్రికా - బంగ్లాదేశ్, 16న ఆస్ట్రేలియా -బంగ్లాదేశ్, 26న ఇంగ్లాండ్- న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. 12న జరిగే భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌ను వీక్షించేందుకు ఏసీఏ చక్కటి అవకాశం ప్రేక్షకులకు కల్పించింది. టికెట్ ధర రూ. 150లుగా నిర్ణయించింది. మిగిలిని అన్నిమ్యాచ్‌లకు రూ.100లకే టికెట్ కొని మ్యాచ్‌ను తిలకించే వెసులుబాటు కల్పించింది.

టోర్నీలో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన భారత్ జట్టు రెండింటిలోను శ్రీలంక, పాకిస్థాన్‌పై గెలుపొంది మంచి ఊపుమీద ఉంది. అభిమాన క్రికెటర్లను చూసేందుకు పెద్ద ఎత్తున స్టేడియంకు వచ్చేందుకు ప్రేక్షకులు సిద్ధమవుతున్నారు. టికెట్ ధరలు కూడా స్వల్పంగానే ఉండటంతో అత్యధిక మంది వీక్షణకు రావొచ్చని అంచనా వేస్తున్నారు.

### సర్వాంగ సుందరంగా స్టేడియం

ప్రపంచకప్ మ్యాచ్‌లు కావడంతో స్టేడియాన్ని ఏసీఏ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. పిచ్ పనులు ఊపందుకున్నాయి. గ్యాలరీల్లో సీట్లపై టికెట్ల నెంబర్ల స్టిక్కర్లు అతికిస్తున్నారు. పచ్చని తివాచీలా మైదానం గడ్డితో అటు క్రీడాకారిణులను, ఇటు ప్రేక్షకులను కనువిందు చేసేందుకు సిద్ధమైంది. గ్యాలరీలను చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉన్న స్థలాలవైపు సూచికలు ఏర్పాటు చేస్తున్నారు. గేట్ల నెంబర్లు, స్టేడియం ముందు బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియం లోపల హాల్‌లో క్రికెటర్ల చిత్రాలు రంగురంగుల విద్యుద్దీపాలతో మెరిసిపోతున్నాయి.

# భారీ సెంచరీతో మెరిసి.. సహచరుడిని కొట్టబోయి.. వివాదంలో పృథ్వీషా



ముంబయి:

టీమ్‌ఇండియాకు దూరమైన బ్యాటర్ పృథ్వీ షా ఇప్పుడిప్పుడే గాడినపడుతున్నాడు. పేలవ ఫామ్, ఫిట్‌నెస్‌తో విమర్శల పాలైన అతడు.. గట్టిగా పుంజుకునే ప్రయత్నం చేస్తున్నాడు. మహారాష్ట్ర తరపున బుచ్చిబాబు ఇన్విటేషనల్ టోర్నమెంట్లో ఆకట్టుకున్న పృథ్వీ.. తాజాగా రంజీ వార్మప్ మ్యాచ్‌లో తన పాత జట్టు ముంబయిపై చెలరేగిపోయాడు. 181 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణితో కలిసి అతడు తొలి వికెట్‌కు 305 పరుగులు జోడించాడు. ముషీర్‌ను కొట్టబోయాడు..: పృథ్వీ సెంచరీ చేసినప్పటికీ ఓ వివాదంలో ఇరుక్కున్నాడు. ముంబయి ఆటగాడు ముషీర్ ఖాన్‌ను బ్యాటుతో కొట్టబోయాడు. పృథ్వీని ఔట్ చేసిన ముషీర్.. అతడికి 'థాంక్యూ' అంటూ వీడ్కోలు ఇచ్చాడు. డబుల్ సెంచరీకి చేరువగా వచ్చి ఔట్ కావడంతో ఆగ్రహించిన పృథ్వీ.. ముషీర్‌ను బ్యాటుతో కొట్టబోయాడు. మైదానంలోని ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకోవాల్సివచ్చింది. వాళ్లు పృథ్వీని దూరంగా తీసుకెళ్లారు. తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే మైదానం వీడాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మోహన్‌లాల్‌కు సిఓఎస్ కమెండేషన్ అవార్డు



మలయాళ నటుడు మోహల్‌లాల్‌కి మరో అరుదైన గౌరవం దక్కింది. భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది చేతుల మీదుగా ఆయన 'సీవోఏఎస్ కమెండేషన్' పురస్కారాన్ని అందుకున్నారు. 2009 నుంచి టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా ఉన్న మోహన్‌లాల్ ఈ గుర్తింపు పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సోషల్‌మీడియాలో కృతజ్ఞతలు తెలుపుతూ 'భారత సైన్యానికి సేవ చేయడం గర్వంగా ఉంది' అన్నారు. ఇటీవలే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుతో సత్కరించబడిన ఆయన, ప్రస్తుతం పలు మలయాళ, తెలుగు చిత్రాల్లో నటిస్తున్నారు. న్యూఢిల్లీలోని ఆర్మీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో మోహన్‌లాల్ లెఫ్టినెంట్ కర్నల్ హోదాలో పాల్గొన్నారు. సైన్యంలో విశిష్ట సేవలందించిన వారికి ఈ అవార్డును ఇస్తుంటారు. మోహన్‌లాల్ 2009లో భారత టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన సైనిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం అవుతూ, దేశానికి తనవంతు సేవలు అందిస్తున్నారు.

## 'తెలుసు కదా' మంచి ప్రేమకథా చిత్రం : నీరజ కోన

'స్కూల్ డేస్ నుంచే నాకు రైటింగ్ అంటే ఇష్టం. కథలు చెప్పడం ఇంకా ఇష్టం. అలా కొన్ని కథలు రాసుకున్నాను. నా స్నేహితులు రానా, నాని వంటివారు బాగా సపోర్ట్ చేశారు. ఒక దశలో సినిమా కథ రాయగలననే నమ్మకం కలిగింది. అలా రాసుకున్న కథే ఈ 'తెలుసు కదా'. ఇది మంచి ప్రేమ కథా చిత్రం. ప్రేమకథతోపాటు ఒక కాంప్లెక్స్ సిటీ కూడా ఉంది. నేను మహిళా దర్శకురాలిని కనుక ఈ సినిమా కథను మహిళా దృష్టి కోణంలో చెప్పలేదు. నిజాయితీగా చెప్పే ప్రయత్నం చేశాం. ఫస్ట్ సిట్టింగ్‌లోనే నా కథను సిద్ధు జొన్నలగడ్డ ఓకే చేయడం, దర్శకురాలిగా నాకు అవకాశం రావడం నా జీవితంలో మంచి అనుభూతి. సిద్ధు మంచి పెర్ఫార్మెన్స్ ఇందులో ఇచ్చారు. కథలో కాంప్లెక్స్‌గా ఉండే రాగపాత్ర కోసం శ్రీనిధిని తీసుకున్నాం. అంజలిపాత్రకి రాశి సరిపోయారు. తమన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా 12 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే ఎన్టీఆర్, రామ్‌చరణ్, రవితేజ, విజయ్, సూర్య వంటి పెద్ద కథానాయకుల సినిమాలకు పనిచేశా. దర్శకురాలిగా నా తర్వాతి చిత్రం కూడా లవ్‌స్టోరీనే. త్వరలోనే వివరాలు వెల్లడిస్తా' అని అన్నారు నీరజ కోన. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది.



## 'మాస్ జాతర' నుండి 'హుడియో హుడియో'



రవితేజ నటించిన 'మాస్ జాతర' చిత్రం నుంచి తాజాగా మూడవ గీతంగా 'హుడియో హుడియో' పాటని విడుదలచేశారు. దేవ్ రచించిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపర్చి తనే స్వయంగా పాడారు. అతనితో మరో సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ గొంతు కలిపారు. శ్రీలీల ఈ చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు. భాను భోగవరపు దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఈ నెల 31న విడుదల కాబోతోంది.

## మోహన్‌బాబు యూనివర్సిటీపై జరిమానా

### మంచు విష్ణు ప్రకటన

హైదరాబాద్ : విద్యార్థుల నుంచి ఎక్కువ ఫీజులు వసూలు చేయడం, ఆదాయాన్ని వెల్లడించకపోవడం, విద్యార్థుల హాజరు నిర్వహణలో అవకతవకలు, ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేయడంపై మోహన్‌బాబు ప్రైవేటు విశ్వవిద్యాలయానికి ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ రూ.15 లక్షల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. అలాగే విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.26,17,52,872 తిరిగి చెల్లించాలని గత నెల 17 న కమిషన్ ఆదేశాలు జారీ చేసి, ఆ వివరాలను వెబ్ సైట్‌లో ఉంచింది. ఈ క్రమంలో మీడియాలో వస్తున్న వార్తలపై యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ మంచు విష్ణు ప్రకటన విడుదల చేశారు. ఉద్దేశపూర్వకంగా మీడియాలో ప్రసారం చేస్తున్న నిరాధార వార్తలను నమ్మొద్దని తెలిపారు. " మోహన్‌బాబు విశ్వవిద్యాలయానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చేసిన కొన్ని సిఫార్సుల గురించి వివిధ మీడియా మాధ్యమాలలో ప్రచారమవుతున్న వార్తలను



ఉద్దేశించి ఈ ప్రకటన విడుదల చేస్తున్నాం. మోహన్‌బాబు విశ్వవిద్యాలయం ఈ సిఫార్సులను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అవి కేవలం సిఫార్సులు మాత్రమే. ఈ వ్యవహారం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విచారణలో (సబ్-జ్యుడిస్) ఉంది.

ఎపిహెచ్ఈఆర్ఎంసి సిఫార్సులకు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయానికి అనుకూలంగా హైకోర్టు 'స్టే' ఉత్తర్వును జారీ చేసింది. కోర్టు ఉత్తర్వును ధిక్కరించి దీనిని పోర్టల్‌లో పెట్టడం దురదృష్టకరం. ఎపిహెచ్ఈఆర్ఎంసి చేసిన సిఫార్సులు సరికాదని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం గట్టిగా విశ్వసిస్తోంది. విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దిగజార్చడానికి ఉద్దేశపూర్వకంగా ఎంపిక చేసిన సమాచారాన్ని మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఇటువంటి నిరాధారమైన వార్తలను నమ్మొద్దని తల్లిదండ్రులకు, మీడియాకు తెలియజేస్తున్నాము. విచారణ సమయంలో మోహన్ బాబు యూనివర్శిటీ బృందం పూర్తిగా సహకరించిందని అదే కమిషన్ తన నివేదికలో పేర్కొనడం చూస్తే, ఎలాంటి తప్పు జరగలేదనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. మాకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ వస్తున్న వేలాది తల్లిదండ్రులకు, విద్యార్థులకు హృదయపూర్వక ధన్యవాదములు. మా ఛాన్సలర్ డాక్టర్ ఎం.మోహన్ బాబు మార్గదర్శకత్వంలో మేము ప్రపంచ స్థాయి సమగ్ర విద్యను అందిస్తూ యువతను శక్తిమంతం చేసే ప్రయత్నాన్ని కొనసాగిస్తాం " అని మంచు విష్ణు తెలిపారు.

## ఆద్యంతం ఆసక్తికరంగా 'అరి' సినిమా : డైరెక్టర్ జయశంకర్

హైదరాబాద్ : ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి ( ఆర్ వీ రెడ్డి ) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుణపనేని కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్ బారు" చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. 'అరి' సినిమా ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో ఈ సినిమా హైలైట్స్ తెలిపారు డైరెక్టర్ జయశంకర్.



సినిమాల మీద ప్యాషన్ తో మంచి ఉద్యోగం వదులుకుని ఇండస్ట్రీకి వచ్చాను. 2014లో టాలీవుడ్ లో అడుగుపెట్టి నాలుగేళ్లకు 2018లో పేపర్ బారు మూవీతో దర్శకుడిని అయ్యాను. తక్కువ టైమ్ లోనే దర్శకుడివి అయ్యావు అన్నారు. నా మొదటి సినిమా తర్వాత పెద్ద సంస్థల నుంచి ఆఫర్స్ వచ్చాయి. అయితే కోవిడ్, ఇతర పరిస్థితుల వల్ల ఆ ప్రాజెక్ట్స్ మెటీరియలైజ్ కాలేదు. అప్పుడు బయటకు వచ్చి 2021లో అరి మూవీకి వర్క్ చేయడం ప్రారంభించాను. నాకు చిన్నప్పటి నుంచి పురాణాలు, ఇతిహాసాలు అంటే ఆసక్తి. వాటి గురించి తెలుసుకుని, అవగాహన పెంచుకున్నాను. మన పురణాల్లో అరిషడ్వర్గాలను జయించాలి అని చెప్పారే తప్ప ఎక్కడా వాటిని ఎలా జయించాలో చెప్పలేదు. 2016లో ఈ స్టోరీ ఐడియా వచ్చింది. హిమాలయాలకు వెళ్లి కొందరు యోగులను కలిసి అరిషడ్వర్గాల గురించి సినిమా చేయాలనే ఆలోచనను తెలిపాను. వారు మంచి ప్రయత్నమని చెప్పి అనేక విషయాలు వెల్లడించారు. అరిషడ్వర్గాలను జయించేందుకు వారి ద్వారా మార్గాలు, సూచనలు తెలుసుకున్నాను. వాటి ఆధారంగానే ఈ 'అరి' చిత్రాన్ని రూపొందించాను. ఇలాంటి కథల్ని పూర్తిగా సందేశాత్మకంగా కాకుండా ఎంటర్ టైనింగ్ గా చెప్పాలి. ఆ ప్రయత్నంలో సఫలమయ్యాననే అనుకుంటున్నా. వైవా హర్ష కామెడీ బాగా నవ్విస్తుంది.

'అరి' లాంటి మూవీని స్టార్స్ కూడా చేయొచ్చు. అయితే పాత్రల కంటే వారి స్టార్ డమ్ రిఫ్లెక్ట్ అవుతుందని పాత్రలకు సరిపోయేలా సాయి కుమార్, అనసూయ, వైవా హర్ష ..ఇలాంటి వారిని తీసుకున్నాను. ఆరు ప్రధాన పాత్రల్లో నటించిన నటీనటుల పర్ ఫార్మెన్స్ హైలైట్ గా నిలుస్తుంది. ఈ పాత్రలన్నీ మీకు బాగా గుర్తుండిపోతాయి. సందేశం ఇవ్వాలని ఈ మూవీ రూపొందించలేదు. నాకు ఉపేంద్ర గారి మూవీస్ బాగా ఇష్టం. ఆయన సినిమాలు కమర్షియల్ గా ఉంటూనే ఒక మెసేజ్ ఉంటుంది. ఉపేంద్ర మూవీ చూసినప్పుడు అలా ఒక సినిమా తెరకెక్కించాలనే ఆలోచన కలిగింది. 'అరి' కథ చెప్పినప్పుడు మా మూవీలో నటించిన ఆర్టిస్టులంతా హ్యాపీగా ఫీలయ్యారు. ఇలాంటి సబ్జెక్ట్ తో మూవీ రాలేదని అన్నారు.

మా 'అరి' మూవీలో వీఎఫ్ఎక్స్ ఆకర్షణగా నిలుస్తాయి. మాకున్న బడ్జెట్ లో క్వాలిటీ విజువల్ ఎఫెక్టులు చేశాం. అలాగే ఏఐ టెక్నాలజీని కూడా ఉపయోగించాం. సినిమాలో రెండు సాంగ్స్ ఉంటాయి. ఆ సాంగ్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మనిషి కోరికలన్నీ ఒకదానితో మరొకటి ముడిపడే ఉంటాయి. మనం కోరుకున్నది దక్కినప్పుడు అహం ఏర్పడుతుంది, అదే పక్కవారికి దక్కితే అసూయ కలుగుతుంది.

అరిషడ్వర్గాలు అనే సబ్జెక్ట్ సాధారణ ప్రేక్షకులకు కూడా సులువుగా అర్థమయ్యే విధంగా 'అరి' సినిమాను రూపొందించాను. ఈ కారణం వల్లే చిత్రీకరణ ఆలస్యమైంది. వీలైనంత సింపుల్ గా ఈ సబ్జెక్ట్ ను తెరకెక్కించాం. సెన్సార్ వాళ్లు సినిమా చూసి అప్రిషియేట్ చేశారు. హార్ట్ టచింగ్ గా మూవీ రూపొందించారని ప్రశంసించారు. మా సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయని ఆశిస్తున్నా. ఎందుకంటే మంచి సినిమాలను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు.

వెంకయ్య నాయుడు, మల్లాది, యండమూరి లాంటి వాళ్లు మా సినిమాను చూసి అభినందించారు. వెంకయ్య నాయుడు గారు 'అరి' సినిమా చూసి మోడరన్ భగవద్గీతలా ఉంది అన్నారు. పురణాలు, ఇతిహాసాలు చదవని యువత ఈ సినిమా చూస్తే వాటిలోని సారం తెలుస్తుంది అన్నారు. ఆయన మాటల్ని గొప్ప ప్రశంసగా తీసుకున్నాం. అశ్వనీదత్ గారు కూడా మా మూవీ చూసి అభినందించారు. మా మూవీని హిందీలో ఒక పెద్ద హీరో, కన్నడలో ఒక స్టార్ చూశారు. వారికి బాగా నచ్చింది. అన్నీ కుదిరితే వారితో ఆయా భాషల్లో 'అరి' రీమేక్ చేస్తా.

'అరి' లాంటి మూవీ చేయాలంటే నిర్మాతలకు అభిరుచితో పాటు ధైర్యం ఉండాలి. అలాంటి ప్రొడ్యూసర్స్ నాకు దొరకడం సంతోషంగా ఉంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు, రిజల్ట్ ఎలా ఉంటుందో తెలియదు. షఉటింగ్ లో కొంత బడ్జెట్ పెరిగింది. అయినా ఇప్పటికీ వారు సపోర్ట్ చేస్తూనే వస్తున్నారు. ఏ సినిమా కూడా ప్రేక్షకులందరికీ యునానమస్ గా నచ్చదు. మన దేశంలో పబ్బులకు వెళ్లేవాళ్లు ఎంతమంది ఉన్నారో, గుడికి వెళ్లేవారు కూడా అంతకంటే ఎక్కువే ఉన్నారు. అలా స్పిరిచువల్ ఆలోచనలు ఉన్నవారు మా సినిమాను చూసినా చాలు అనుకుంటున్నాం.

'అరి' సినిమా యూత్ ఆడియెన్స్ కు కూడా బాగా కనెక్ట్ అవుతుంది. ప్రీ క్లైమాక్స్ వరకు మా మూవీ ఏం జరుగుతుంది నెక్ట్స్ అనే క్యూరియాసిటీ క్రియేట్ చేస్తుంది. క్లైమాక్స్ 20 నిమిషాలు మాత్రం ఎక్సలెంట్ గా అనిపిస్తుంది. తమకు కావాల్సినది దక్కించుకునేందుకు కొందరు వ్యక్తులు ఏం చేశారు అనేది ఈ చిత్ర నేపథ్యం. జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తో ఓ సినిమా చేయబోతున్నా. డిసెంబర్ నుంచి ఆ మూవీ షఉటింగ్ కు వెళ్తున్నాం.

## అందాల రాకుమారికి పెరుగుతున్న ఆఫర్లు!

కొంతమంది హీరోయిన్లకు స్టార్ హీరోల జోడీకట్టే ఛాన్స్ ఆరంభంలోనే వస్తుంది. మరికొంత మంది హీరోయిన్స్ కి అలాంటి అవకాశాలు కాస్త లేట్ గా వస్తాయి. ఇంకొంతమంది హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాలలో వేషాల కోసం తొందరపడకుండా, నిదానంగా తమ కెరియర్ ను కొనసాగిస్తూ ఉంటారు. అలాంటివారి ప్రతిభకు అదృష్టం తోడైతే భారీ సినిమాలు నేరుగా వచ్చి పలకరిస్తాయి. సంచలన విజయాన్ని దోసిట్లో పెడతాయి. అలాంటి హీరోయిన్స్ లో ఒకరిగా రుక్మిణి వసంత్ కనిపిస్తుంది. 'సప్త సాగరాలు దాటి' సినిమా చూసినవారు, అమ్మాయి ఎంత పద్ధతిగా ఉంది అనుకున్నారు. ఈ మధ్య కాలంలో చీరకట్టులో ఇంత అందంగా ఉన్న హీరోయిన్స్ ను చూడలేదని చెప్పుకున్నారు. అయితే ఈ అమ్మాయి చీరకట్టులోనే బాగుంటుందనే అభిప్రాయాలు పెరుగుతూ ఉండటంతో, ఆ ముద్ర నుంచి బయటపడటానికి .. గ్లామరస్ గా మెరవడానికి రుక్మిణి ప్రయత్నం చేస్తూ వచ్చింది. సరిగ్గా ఆ సమయంలో వచ్చిన 'కాంతార చాప్టర్ 1' ఆమె ముచ్చట తీర్చింది. ఈ సినిమాలో యువరాణి పాత్రలో ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో బాక్సాఫీస్ బద్ధకాన్ని వదిల్చి వేస్తోంది. ఈ నేపథ్యంలో కన్నడతో పాటు, తెలుగు .. తమిళ భాషల్లో ఆమెకి ఆఫర్లు పెరుగుతున్నట్టుగా తెలుస్తోంది. తెలుగు ఆడియన్స్ మాత్రం వెంకటేశ్ .. పవన్ కల్యాణ్ .. ప్రభాస్ వంటి సీనియర్ స్టార్ హీరోల సరసన నాయికగా ఈ బ్యూటీ సరిగ్గా కుదురుకుంటుందని అభిప్రాయ పడుతున్నారు. త్వరలోనే వారి ముచ్చట తీరుతుందేమో చూడాలి. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ జోడీగా 'డ్రాగన్' చేస్తున్న సంగతి తెలిసిందే.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339